





# అక్షర రేఖ

తెలుగు దినపత్రిక

Simultaneously Published from Adilabad


RNI NO. TELTEL /2012/44706

శనివారం 18 ఏప్రిల్ 2026 | Akshara Rekha Telugu Daily | వెల : రూ.2/- | సంపుటి : 13 | సంపుటి : 313 | పేజీలు : 8


## అన్ని నౌకలకు అనుమతి



- గుడ్‌న్యూస్.. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచిన ఇరాన్..
- ఇకపై అందరికీ అందుబాటులో హోర్ముజ్ జలసంధి
- ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం
- పది రోజులపాటు కాల్పుల విరమణ కొనసాగనుంది.



## వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు

- మిగిలిన రెండింటిని ఉపసంహరించుకున్న కేంద్రం
- లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ఓటింగ్
- బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయిన ఎన్డీఏ



### రాజధాని పరిధిలో పురుషుల కంటే

## మహిళలే ఎక్కువ

- టాప్‌లో రంగారెడ్డి
- లింగ నిష్పత్తిలో రంగారెడ్డి జిల్లాదే అగ్రస్థానం
- మూడు జిల్లాల్లో మహిళల సంఖ్యే ఎక్కువ
- స్పష్టం చేసిన సామాజిక ఆర్థిక కుల సర్వే నివేదిక
- మేడ్చల్-మల్కాజిగిరిలో సగటు లింగ నిష్పత్తి 1066

హైదరాబాద్

తెలంగాణలో నగర, పట్టణ జనాభాలో లింగ నిష్పత్తి చాలా ముందంజలో ఉంది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఆధారంగా తాజాగా విడుదలైన తెలంగాణ అర్బన్ డెమోగ్రాఫిక్ టేబుల్స్ (2024) గణాంకాల ప్రకారం రాజధాని పరిధిలోని జిల్లాల్లో పురుషుల కంటే మహిళల సంఖ్య ఎక్కువగా - మిగతా3లో

### వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో

# తెలంగాణ టాప్



- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి
- కేంద్రానికి సీఎం విజ్ఞప్తి
- రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి
- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన బకాయిల విడుదలకు వినతి

హైదరాబాద్

యాసంగి పంటకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన రాష్ట్ర బృందం తెలంగాణకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరింది. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను పాఠశాలలు, వసతిగృహాలకు పునరుద్ధరించాలని - మిగతా3లో



### మహిళా రిజర్వేషన్ల మాటున

## డీలిమిటేషన్

- మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర
- కేంద్రంపై రాహుల్ ధ్వజం
- అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే మోదీ వ్యూహం : రాహుల్
- ఇంద్రజాలికుడు అడ్డంగా దొరికిపోయారు
- బీజేపీ తమకు లాభం చేకూర్చేలా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది

### ఏరోస్పేస్' వ్యూహాత్మక కేంద్రంగా

# తెలంగాణ



### ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి

## దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు

- 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్న అమిత్ షా
- ఒక ఎంపీ లక్షల మంది ప్రజల సమస్యలను ఎలా వినగలరన్న హోం మంత్రి




- రాష్ట్రాలే రాబోయే రోజుల్లో 'ఏరోస్పేస్' లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయి
- ఆ దిశగా... ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నాం
- 'ఏరోస్పేస్' అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదు
- ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది

హైదరాబాద్

భవిష్యత్తు 'ఏరోస్పేస్' రంగ అవసరాలకు అనుగుణంగా 'తెలంగాణ'ను దేశానికి ఒక వ్యూహాత్మక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆర్అండ్ డీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అండ్ కాంప్లియెన్స్.. ఈ మూడింటిని అనుసంధానించగలిగే దేశాలు, రాష్ట్రాలే రాబోయే రోజుల్లో 'ఏరోస్పేస్' లో గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతాయన్నారు. ఆ దిశగా... ఈ రంగంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సవాళ్లు, మార్పుల్ని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శుక్రవారం 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో 'ఛేంజింగ్ సినారియో ఇన్ ఏ రోస్పేస్; ఆర్అండ్‌డీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సర్టిఫికేషన్' - మిగతా3లో

### కాళేశ్వరం మరమ్మత్తులకు

# ప్రత్యేక కమిటీ

మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల రీహాబిలిటేషన్‌కు ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీ



హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం మరమ్మత్తుకు సంబంధించిన పనులపై కల్నల్ పరీక్షిత్ మెహ్రా అధ్యక్షతన తొమ్మిది మంది సభ్యులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల రీహాబిలిటేషన్‌కు ప్రత్యేక కోఆర్డినేషన్ కమిటీ నియమించినట్లు పేర్కొంది. మే 30 నాటికి మరమ్మత్తుకు సంబంధించిన పరిశోధన పూర్తిచేయాలని ఆదేశించింది.




## డీలిమిటేషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- మోదీ సర్కార్‌కు విపక్షాలు డిమాండ్
- నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై భగ్గుమన్న ప్రతిపక్ష పార్టీలు
- ఆ బిల్లును విత్‌డ్రా చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న విపక్షాలు
- మోదీ సర్కార్‌పై కాంగ్రెస్, ఆర్‌జేడీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ ఫైర్

అక్షర రేఖ

శనివారం 18 ఏప్రిల్ 2026

# మహిళా రిజర్వేషన్ల మాటున డీలిమిటేషన్

ప్రభుత్వం ఇప్పుడు పెట్టేది అసలు మహిళా బిల్లే కాదని, 2023లోనే అది ఆమోదం పొందిందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పుడు కొత్తగా మహిళా బిల్లు పెట్టాల్సిన అవసరమే లేదని చెప్పారు. మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పాత మహిళా బిల్లును రద్దుచేసి కొత్త బిల్లు తీసుకురావాలని కేంద్రానికి సవాల్ విసిరారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా మద్దతు ఇస్తుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులపై శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. ఆ వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి. కేవలం అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే ప్రధాని మోదీ ఈ రాజకీయ వ్యూహాన్ని పన్నారని ఆయన విమర్శించారు. బీజేపీ తమకు లాభం చేకూర్చేలా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాన్ని 'గెర్రీమాండరింగ్'గా రాహుల్ అభివర్ణించారు. 2029 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ఈ కుట్రకు తెర తీసిందని, నియోజకవర్గాల పటాలను మార్చడం ద్వారా ప్రతిపక్షాల బలాన్ని తగ్గించాలని మోదీ చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లే ఈ పార్లమెంటు సెషన్ అజెండా అయితే, తాము ఏమాత్రం సంకోచించకుండా ఈ క్షణంలోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. 2023లో పార్లమెంటు ఆమోదాన్ని పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు విషయంలో కేంద్ర సర్కారుకు సహకరించేందుకు మేం రెడీ. కానీ ఇప్పుడు కేంద్ర సర్కారు తేవాలని చూస్తున్నది మహిళా కోటా బిల్లులా కనిపించడం లేదని రాహుల్ విమర్శించారు. దానితో డీలిమిటేషన్‌కు లింకులు పెడుతున్నారని మండిపడ్డారు. భారతదేశ జాతీయ ఆలోచనా విధానంలో మహిళలు ఒక చోదక శక్తి అని ఆయన అన్నారు. మనమంతా మహిళల జీవితాల ద్వారా ఎంతో ప్రభావితులం అయ్యామని, ఎన్నో విషయాలను నేర్చుకున్నామన్నారు.

కానీ కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్, జనాభా గణనలతో మహిళా కోటాకు ముడిపెట్టడం సరికాదన్నారు. మహిళా కోటా అమలుకు డీలిమిటేషన్‌తో అసలు సంబంధమే లేదని, దీన్ని వెంటనే అమల్లోకి తేవచ్చని రాహుల్ తెలిపారు. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం చేసేలా నియోజకవర్గాల పునర్విభజన చేయడం అనేది దేశ వ్యతిరేక చర్య కంటే తక్కువేం కాదన్నారు. కులగణన డేటాను విస్మరించడం ద్వారా ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాల హక్కులను కేంద్రం దోచుకుంటోందని ('హిస్సా చోరీ') ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఇంద్రజాలికుడు అడ్డంగా దొరికిపోయారు



ప్రధాని మోదీని ఇంద్రజాలికుడితో పోలుస్తూ, ఆయన మ్యాజిక్ ట్రిక్స్ ఇప్పుడు పని చేయడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఇంద్రజాలికుడు ఇప్పుడు అడ్డంగా దొరికిపోయారు అని ఆయన విమర్శించారు. బాలాకోట్ స్ట్రైక్స్, నోట్ల రద్దు వంటివి గతంలో ప్రధాని చూపిన మ్యాజిక్ ట్రిక్స్ అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు డీలిమిటేషన్ బిల్లు ద్వారా దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని మోదీ చూస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత ఆరోపించారు. దేశ రాజకీయాల్లో జరుగుతున్న మార్పులను చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోందని, అందుకే మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పెంపు చేపట్టి తమ బలాన్ని పెంచుకోవాలని చూస్తోందన్నారు. నిజమైన శక్తి ఎప్పుడూ చీకటిలోనే దాగి ఉంటుంది, అది బయటకు కనిపించదని ఒక కథ రూపంలో ఇంద్రజాలికుడి ఉదాహరణను రాహుల్ వివరించారు.

### ప్రధానిని ఇంద్రజాలికుడు అని పిలవడం సరికాదు : రిజిజు

ఇక రాహుల్ గాంధీ ప్రధానిని ఇంద్రజాలికుడు అని పిలవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి పదాలు అసభ్యకరమైన పదజాలం కిందకు వస్తాయన్నారు. ఇక రాహుల్ వ్యాఖ్యలపై స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, సభలో గౌరవప్రదమైన భాషను వాడాలని హెచ్చరించారు. చర్చలోని అంశానికి లోబడి మాట్లాడాలని సూచించారు. ఈ క్రమంలో సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, సభ గందరగోళంగా మారింది.

### 16 ఇప్పుడొక చిక్కుముడిలా మారింది

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన తేదీలోని 16 అనే అంకె ఇప్పుడొక చిక్కుముడిలా మారిందని రాహుల్ అన్నారు. ఈ తేదీ వెనుక ఒక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రాహుల్ తన ఫోన్‌ను చూసుకుంటూ 16వ తేదీ కోసం ఎదురుచూడండి, ఆ నంబర్ 16లోనే ఈ చిక్కుముడికి సమాధానం ఉందని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 16న ప్రభుత్వం హడావుడిగా మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను ప్రవేశపెట్టడం వెనుక ఒక రకమైన భయం కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల మ్యాప్‌ను మార్చే ఉద్దేశంతోనే ఈ 16వ తేదీని ఎంచుకున్నారని రాహుల్ చెప్పారు. ఇవాళ ప్రధాని మోదీ ప్రసంగం శక్తి హీనంగా సాగిందని చెబుతూ, ఈ మొత్తం వ్యవహారమంతా “16” అనే అంకె చుట్టూ తిరుగుతోందని రాహుల్ చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశమయ్యాయి.

### కుల గణనను బేఖాతరు చేసే యత్నం

'ఓబీసీలకు అధికారం, చట్టసభల్లో ప్రాతినిధ్యం ఇవ్వాలనే ఆలోచనే మోదీ సర్కారుకు లేదు. వాళ్ల అజెండా కూడా అదే. రాబోయే 15 సంవత్సరాల పాటు చట్టసభల్లో ప్రాతినిధ్యానికి కుల గణనతో ఎలాంటి సంబంధం లేకుండా చేసేందుకు కేంద్రం యత్నిస్తోంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాల నుంచి చట్టసభల ప్రాతినిధ్యాన్ని లాక్కోవాలని బీజేపీ భావిస్తోంది. అలా జరగకుండా మేం అడ్డుకుంటాం. ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ప్రభుత్వం టచ్ చేయకుండా మేం చూస్తాం' అని రాహుల్ తెలిపారు.

### ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి తెలుసు

'యావత్ విపక్షాలు కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాన్ని ఓడిస్తాయి. డీలిమిటేషన్‌తో లింకు కలిగిన మహిళా కోటా బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి బాగా తెలుసు. అయినప్పటికీ దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను (నియోజకవర్గాల స్వరూపాన్ని) మార్చేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. ఇక ఇదే సమయంలో తనను తాను మహిళా పక్షపాతిగా చూపించుకోవాలని మోదీ భావిస్తున్నారు. బీజేపీ వాళ్లు తామే భారత ప్రజలం, తామే భారత సైనికులం అని భావిస్తున్నారు. వాస్తవం ఏమిటంటే, వాళ్లు అవేవీ కాదు. అందుకే భారత ప్రజలు, సైనికుల మాటున నిలిచి వ్యాఖ్యలు చేయడాన్ని బీజేపీ వాళ్లు ఆపాలి' అని రాహుల్ చెప్పారు.

### లోక్‌సభలో వాగ్వాదం

శుక్రవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం ఏర్పడింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా కేటాయించాలని, కుల గణనను వెంటనే చేపట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇప్పుడు కేంద్రం ప్రవేశపెట్టిన మహిళా కోటా బిల్లు మహిళల సాధికారత కోసం కాదని, కుల గణనను పక్కదారి పట్టించేందుకే దీన్ని తెరపైకి తెచ్చిందని ఆయన మండిపడ్డారు. దీనిపై అధికార పక్షం తీవ్రంగా స్పందించడంతో సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకు చిన్న రాష్ట్రాలు, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర చేస్తోందని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు.

# షేక్ హసీనాను బంగ్లాకు అప్పగించే అంశాన్ని సమీక్షిస్తున్నాం

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలంటూ ఆ దేశం నుంచి వచ్చిన అధికారిక అభ్యర్థనపై భారత్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంపై చట్టపరమైన, న్యాయ మార్గాల ద్వారా సమీక్షిస్తున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ తెలిపారు. బంగ్లాలో నెలకొన్న అనేక నాటకీయ రాజకీయ మార్పుల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వంతో తన భాగస్వామ్యాన్ని స్థిరీకరణకు భారత్ ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. “ప్రస్తుతం కొనసాగుతున్న న్యాయ, అంతర్గత చట్టపరమైన ప్రక్రియల్లో భాగంగా బంగ్లాదేశ్ అభ్యర్థనను పరిశీలిస్తున్నాం. ఈ విషయంపై సంబంధిత వర్గాలు అన్నింటితో నిర్మాణాత్మకంగా చర్చలు కొనసాగిస్తాము. అన్ని పరిణామాలను మేము చాలా నిశితంగా గమనిస్తున్నాం. కొత్త ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయడానికి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే భారత్? ఆకాంక్షను విదేశాంగ మంత్రి ఇప్పటికే చెప్పారు. వాణిజ్యం, ఇంధనం, ప్రాంతీయ భద్రత రంగాల్లో సహకారం కోసం కొత్త ప్రతిపాదనలను అన్వేషించడానికి అధికారిక మార్గాలను ఉపయోగించుకోవడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై ఇరు దేశాల దృక్పథాలను ఏకీకృతం చేయడానికి త్వరలోనే అధికారిక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. అటు హసీనా అప్పగింతపై ప్రతిష్టంభన ఉన్నప్పటికీ భాగస్వామ్యం పటిష్టంగా కొనసాగుతుంది.” 2024 జూలైలో విద్యార్థుల నేతృత్వంలోని తిరుగుబాటుతో అప్పటి బంగ్లాదేశ్? ప్రధాని



షేక్ హసీనా దేశం వదిలి వచ్చి భారత్?లోనే ఉంటున్నారు. అయితే, స్వదేశంలో చేపట్టిన విచారణను ఎదుర్కొనేందుకు హసీనాను తిరిగి అప్పగించాలని భారత్?ను బంగ్లాదేశ్? కోరింది. 2025లోనే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలంటూ తమకు లేఖ అందినట్లు భారత్? అంగీకరించింది. అయితే ఈ అభ్యర్థనను ప్రస్తుతం చట్టాల ప్రకారం సమీక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రక్రియ అంతర్గత చట్టపరమైన నిబంధనలకు లోబడి ఉంటుందని జైశ్వాల్ స్పష్టం చేశారు.

### తారిఖ్ రెహ్మాన్ పార్టీ విజయంతో భారత్–బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలపై మళ్లీ ఆశలు

గతంలో మాజీ ప్రధాని షేక్ హసీనా హయాంలో బంగ్లాదేశ్‌కు భారత్‌తో చాలా మంచి సంబంధాలు ఉండేవి. కానీ, అక్కడి విద్యార్థుల తిరుగుబాటుతో ఆమె అధికారం కోల్పోయింది. అనంతరం మహ్మమద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక సర్కార్‌తో భారత్– బంగ్లాదేశ్?ల మధ్య సంబంధాలు తీవ్రంగా క్షీణించాయి. అయితే, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్? రెహ్మాన్? నేతృత్వంలోని పార్టీ విజయం సాధించడంతో భారత్– బంగ్లాదేశ్‌ల మధ్య సంబంధాలపై మళ్లీ ఆశలు చిగురుస్తున్నాయి.

### ఇజ్రాయెల్– లెబనాన్ కాల్పుల విరమణకు భారత్? అధికారిక మద్దతు

ఇదిలా ఉండగా ఇజ్రాయెల్– లెబనాన్‌ల మధ్య ఇటీవల అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణకు భారత్? అధికారిక మద్దతు ప్రకటించింది. ప్రాంతీయ స్థిరత్వాన్ని లక్ష్యంగా చేసుకునే అన్ని ప్రయత్నాలకు తాము మద్దతిస్తామని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. శాంతి దిశగా వేసే ప్రతి అడుగును భారతదేశం స్వాగతిస్తుందని వీజూూ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వ్యాఖ్యానించారు. అటు ఇరాన్– అమెరికాల మధ్య శాంతి ప్రక్రియలో పాకిస్థాన్ ప్రమేయం గురించి ప్రశ్నించగా, ఈ పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని పేర్కొన్నారు. “పశ్చిమాసియా యుద్ధంలోని అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాము” అని జైశ్వాల్ అన్నారు. లెబనాన్–ఇజ్రాయెల్‌ల మధ్య 10 రోజుల కాల్పుల విరమణ గురువారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరు దేశాల నాయకత్వాల మధ్య తొలి సమావేశాన్ని సులభతరం చేసేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పిన తరుణంలో కాల్పుల విరమణ జరిగింది.

# అన్ని నౌకలకు అనుమతి

ప్రపంచానికి ఇది గుడ్‌న్యూస్. అందరూ ఎప్పుడెప్పుడు ఓపెన్ అవుతుందా అని ఎదురుచూసిన హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఈ మేరకు సోషల్ మీడియాలో దీనిపై శుక్రవారం ఒక ప్రకటన చేశారు. ఇకపై హార్ముజ్ జలసంధి అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇటీవలే అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య గురువారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. పది రోజులపాటు కాల్పుల విరమణ కొనసాగనుంది. ఈ నేపథ్యంలోనే హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నంత కాలం జలసంధి తెరిచి ఉంచే అవకాశం ఉంది. “లెబనాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమలు నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నాం. ఈ ఒప్పందం అమలులో ఉన్నంతకాలం హార్ముజ్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని రకాల వాణిజ్య నౌకల్ని అనుమతిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే అన్ని పోర్టులకు సమాచారం అందించాం.



సంబంధిత రూట్ల గురించి కూడా తెలియజేశాం” అని అరాగ్చీ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా స్పందించారు. హార్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఇరాన్ ఈ నిర్ణయానికి తీసుకోవడానికి లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందమే కారణం. దీనికి కూడా ట్రంప్ తనవంతు ప్రయత్నం చేశారు. అంతేకాదు.. ఇరు దేశాల అధ్యక్షుల్ని చర్చలు జరిపేందుకు ఒప్పిస్తానని ట్రంప్ అన్నారు. హార్ముజ్ జలసంధి అందుబాటులోకి వస్తే ప్రపంచంలోని అనేక దేశాల చమురు కష్టాలు తీరుతాయి. అంతేకాదు.. ఆహారం, ఎరువులు, ఔషధాలు వంటివి కూడా అందుబాటులోకి వస్తాయి. మరోవైపు ఇరాన్ చేసిన ఈ ప్రకటనతో అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి.

## ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు



ఉత్తరాది, దక్షిణాది భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి సభ్యులు వ్యతిరేకించారని ఆరోపించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు విపక్ష కూటమి వ్యతిరేకమని విమర్శించారు. నారీమణులకు మేలు చేసే బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రతిపక్ష పార్టీలను ప్రశ్నించారు. మహిళా సాధికారత దిశగా చేసే పనులకు ఎందుకు మద్దతివ్వడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేసేలా ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్ర వ్యత్యాసం ఉందన్నారు. ఒక ఎంపీ లక్షల మంది ప్రజల సమస్యలను ఎలా వినగలరని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపుదలను కూడా విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై జరిగిన చర్చకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానమిచ్చారు.

## డీలిమిటేషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి



డీలిమిటేషన్ బిల్లును విపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను మార్చకుండా, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాయి. అలాగే నియోజకవర్గాలను పునర్విభజన బిల్లు కుట్రతో నిండి ఉందని ఆరోపిస్తున్నాయి. దేశంలోని చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లను వేగంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టిన మూడు కీలక బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో విపక్షాలు స్పందించాయి.

### ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయాలనుకుంటున్నారు
### కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్

ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల (543) సంఖ్యను మార్చకుండానే, 2023లో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, రాజ్యాంగ (131వ సవరణ) బిల్లును ఉపసంహరించుకోవాలని అన్నారు. అలా చేస్తే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రతిపక్షాలు మద్దతు ఇస్తాయని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ల పేరిట మోదీ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేయాలనుకుంటుందని, దాన్ని తాము అనుమతించబోమన్నారు. “2023 నాటి మహిళా రిజర్వేషన్ల చట్టం నోటిఫికేషన్ నిన్న (గురువారం) రాత్రి వెలువడింది. మోదీ సర్కార్ మహిళా సాధికారత గురించి మాట్లాడుతోంది. ప్రధాని మోదీ నాటకాన్ని మేము చూశాము. 2023 నాటి చట్టాన్ని గురువారం రాత్రి నోటిఫై చేశారు. వారికి నిజాయితీ ఉంటే చట్టం అమలులో ఈ జాప్యం ఎందుకు?. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కేంద్రమే జాప్యం చేసింది” అని పార్లమెంట్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.

### రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని కుట్ర : తేజస్వీ యాదవ్

మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును చాలా చాకచక్యంగా మోదీ సర్కార్ తీసుకొచ్చిందని ఆర్జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తోందని అన్నారు. అంతేకాకుండా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తమ అజెండాను అమలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. “మహిళా రిజర్వేషన్ల బిల్లులో నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని చాలా తెలివిగా చేర్చారు. ఈ రెండూ పూర్తిగా వేర్వేరు అంశాలు. మహిళా రిజర్వేషన్ బిల్లు గతంలోనే ఆమోదం పొందింది. ఆ సమయంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అలాగే ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్ ఇవ్వాలని మేము డిమాండ్ చేశాం. కానీ అది జరగలేదు. మహిళా రిజర్వేషన్ అంశాన్ని కేవలం ప్రచార ఆర్భాటం కోసమే మోదీ ప్రభుత్వం ముందుకు తీసుకువస్తోంది. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తోంది. అందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ తమ అజెండాను అమలు చేయాలని చూస్తున్నాయి. అందుకు మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.” అని ఆర్జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ తెలిపారు.

### ఈ బిల్లు భారీ కుట్రతో నిండి ఉంది : తమిళనాడు సీఎం స్టాలిన్

లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని, అధికారాన్ని తగ్గించేందుకు డీలిమిటేషన్ బిల్లు 2026ను తీసుకొచ్చారని, ఇందులో భారీ కుట్ర ఉందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. ఈ డీలిమిటేషన్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లు ప్రస్తుత రూపంలో పూర్తి మోసం తప్ప మరేమీ లేదన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన డీలిమిటేషన్ కమిషన్ ద్వారా భారతీయ జనతా పార్టీ తమకు నచ్చిన రీతిలో నియోజకవర్గాలను పునర్విభజన చేసుకునేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తోందని ఆరోపించారు. ఈ నల్ల చట్టం ఒక పెద్ద కుట్రతో నిండి ఉందని మండిపడ్డారు. తమ ఆవేదనను లెక్కచేయకుండా అహంకారంతో డీలిమిటేషన్ చేస్తే తమిళనాడులో కేంద్రం తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్టాలిన్ హెచ్చరించారు.

### ఎన్‌డీఏ సర్కార్ అత్యంత నిజాయితీ లేనిది
### ఎస్పీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రను చెరిపేయాలని కేంద్ర ప్రభుత్వం ఎందుకు యత్నిస్తోందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. 2023లో ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పుడే దానికి ఏకగ్రీవ మద్దతు లభించిందని గుర్తు చేసుకున్నారు. అలాగే బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అత్యంత అవినీతిమయమైనది, నిజాయితీ లేనిదని మండిపడ్డారు.

### సీట్లు పెరుగుతాయ్– ఎవరూ నష్టపోరు : బీజేపీ నేత అన్నామలై

డీలిమిటేషన్ బిల్లు వల్ల తమిళనాడులో ఎంపీ సీట్ల సంఖ్య 39 నుంచి 59కు పెరుగుతుందని బీజేపీ నేత అన్నామలై స్పష్టం చేశారు. అంటే తమిళనాడులో 50 శాతం ఎంపీ స్థానాలు పెరుగుతాయన్నారు. ఈ బిల్లు అమలు తర్వాత కూడా లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం వాటా 21.9 శాతంగానే ఉంటుందని, అందులో ఎటువంటి మార్పు ఉండదన్నారు. ఈ బిల్లు ద్వారా ఏ రాష్ట్రం ఎంపీ సీట్లలో కోత పడదని, ఎవరూ నష్టపోరని వెల్లడించారు. మదురైలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఈ మేరకు అన్నామలై వ్యాఖ్యానించారు.

# ఏరోస్పేస్ వ్యూహాత్మక కేంద్రంగా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 'ఏరోస్పేస్' అంటే కేవలం యంత్రాల తయారీ మాత్రమే కాదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అది ఒక దేశ వ్యూహాత్మక శక్తికి, ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ రంగంలో ఒకప్పుడు.. యూఎస్, రష్యా, ఐరోపా దేశాలదే ఆధిపత్యం చెలాయించేవని, ఇప్పుడు వాటికి ధీటుగా 'గ్లోబల్ సప్లై చైన్'లో మన దేశం కూడా 'కీ' రోల్ ప్లే చేస్తోందన్నారు. యునెస్కో గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో సైంటిస్టులు, ఇంజనీర్లు మన దేశంలోనే ఉన్నారన్నారు. కానీ... మెకిన్సే నివేదిక ప్రకారం.. ల్యాబ్‌ల్లో జరిగే పరిశోధనల్లో 30 శాతం కూడా కమర్షియల్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పరిశోధనల్ని ఉత్పత్తులుగా మార్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామన్నారు. డెలాయిట్ గ్లోబల్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సర్వే ప్రకారం.. నేడు 74 శాతం మంది ఏరోస్పేస్ సీఈఓలు కేవలం తక్కువ ఖర్చు కంటే పటిష్ఠమైన సప్లై-చైన్, తయారీ సామర్థ్యానికే ప్రాధాన్య మిస్తున్నారన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42,000 కొత్త ఎయిర్ క్రాఫ్ట్ అవసరం ఉంటుందని బోయింగ్, ఎయిర్‌బస్ సంస్థలు అంచనా వేశాయన్నారు. ఈ డిమాండ్‌ను 'హైదరాబాద్' అందిపుచ్చుకునేలా ఇప్పటికే ఇక్కడున్న ప్రిసిషన్ ఇంజనీరింగ్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ నెట్‌వర్క్, బలమైన ఎంఎస్ఎంఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికీ మనం ఏరోస్పేస్ టెస్టింగ్, సర్టిఫికేషన్ కోసం విదేశాలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఫలితంగా ఖర్చు పెరగడమే కాకుండా.. ఉత్పత్తుల గ్రౌండింగ్‌కు 18 నెలల నుంచి 24 నెలల వరకు అదనపు సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ స్థాయి సర్టిఫికేషన్ ఎకో సిస్టంను అభివృద్ధి




చేసేందుకు 'హైదరాబాద్' అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని.. ఆ దిశగా కేంద్రం చొరవ చూపాల్సిన అవసరముందన్నారు. డ్రోన్లు, రీయూజబుల్ రాకెట్లు, ఏఐ ఏవియానిక్స్, 3డీ ప్రింటింగ్, అడ్వాన్స్డ్ మెటీరియల్స్ తదితర అంశాలు రాబోయే రోజుల్లో ఏరోస్పేస్ భవిష్యత్తును శాసిస్తాయన్నారు. అందుకు అనుగుణంగానే.. ఇప్పటి నుంచే 'తెలంగాణ'ను సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో ఉన్న 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ దిగ్గజ సంస్థలకు విడిభాగాలను సరఫరా చేస్తూ 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ ఆర్అండ్ డీ ఇన్స్టిట్యూషన్లు, గ్లోబల్ ఓఈఎంలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ఆదిభట్ల ఏరోస్పేస్ ఎస్ఈజెడ్, ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, రోడ్డు నెట్‌వర్క్ తదితర మౌలిక సదుపాయాలు, టాలెంట్ పూల్... ప్రపంచ ఏరో స్పేస్ దిగ్గజ సంస్థలు తెలంగాణ వైపు చూసేలా చేశాయన్నారు. 'హైదరాబాద్' వేదికగా ఏరోస్పేస్ భవిష్యత్తును నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. అనంతరం ఏరోస్పేస్ రంగంలో విశేష కృషి చేసిన పలువురు శాస్త్రవేత్తలు, ప్రముఖులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యులు డా.వీకే సారస్వత్, డీజీ సీఎస్ఐఆర్ అండ్ డీఎస్ఐఆర్ సెక్రటరీ డీ.ఎన్ కళైసెల్వి, 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' ప్రతినిధులు డా.సతీష్ రెడ్డి, డా.సోమనాథ్, రాజబాబు, డా.శివ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాజధాని పరిధిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ

-మొదటిపేజీ తరువాయి

ఉండటం ఇక్కడ విశేషం. జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సామాజిక వర్గాల వారీగా లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం మెరుగైన ఆరోగ్య సౌకర్యాలు, ప్రజల్లో అవగాహన, మారుతున్న సామాజిక దృక్పథానికి ఈ ఫలితాలే నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు.

### జీహెచ్ఎంసీలో

జీహెచ్ఎంసీ పరిధిలో లింగనిష్పత్తి 1078గా ఉంది. అంటే ఇక్కడ ప్రతి 1000 మంది పురుషులకు 1078 మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా బీసీ-ఏలో (1090), బీసీ-ఈ (1087), ఓసీల్లో (1108) వర్గాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా బలంగా ఉంది. ముస్లిం మైనారిటీలు(బీసీ-ఈ)లో లింగ నిష్పత్తి 1087గా ఉంది. బీసీ-సి(962) వర్గాల్లో మాత్రం పురుషులతో పోలిస్తే మహిళల జనాభా తక్కువగా ఉంది.

### రంగారెడ్డి జిల్లా..

రంగారెడ్డి జిల్లాలో 1095 లింగ నిష్పత్తితో తెలంగాణలోనే అగ్రస్థానంలో నిలిచింది.

ఓసీల్లో 1145తో పురుషుల కంటే మహిళల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోనే ఇది అత్యధికం.

ఎస్టీల్లో లింగ నిష్పత్తి 1137గా నమోదైంది. బీసీ-సి సామాజిక వర్గంలో 1008గా లింగ నిష్పత్తి ఉంది.

### మేడ్చల్-మల్కాజిగిరిలో..

మేడ్చల్ జిల్లాలో సగటు లింగ నిష్పత్తి 1066గా ఉంది.

ఈ జిల్లాల్లో ఎస్టీ సామాజిక వర్గంలో 1088, ఓసీల్లో 1097, బీసీల్లో 1053 నిష్పత్తిలో మహిళలు ఉన్నారు. ఎస్సీల్లో సగటు 1026గా ఉంది.

1000 : 1095

### నగర జీవనంలో అతివల సారథ్యం

పట్టణ ప్రాంతాల్లో సామాజిక మార్పు స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మూడు జిల్లాల గణాంకాలను పరిశీలిస్తే కుటుంబానికి మహిళలు వెన్నుదన్నుగా నిలుస్తున్నట్లు ఈ లెక్కలు చెబుతున్నాయి. జీహెచ్ఎంసీలో 21.8 శాతం,



రంగారెడ్డి జిల్లాలో 20.4శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 18.9శాతం మంది మహిళలే ఇంటి యజమానులుగా ఉండటం అభినందనీయమైన విషయం. ఈ లెక్కన తెలంగాణవ్యాప్తంగా సగటు 23.9 శాతంగా ఉంది.

### నెలకు రూ.5 వేల సంపాదన

మహానగరం హైదరాబాద్‌లో నెలకు కేవలం రూ.5 వేలలోపు సంపాదనతో సగటున 9 శాతం మంది జీవనం కొనసాగిస్తున్నారు. ఇది రాష్ట్ర సగటు(12శాతం) కంటే తక్కువగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో 9.3 శాతం, జీహెచ్ఎంసీలో 9.2 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 8.1 శాతం మంది ప్రజల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.50 వేల లోపు మాత్రమే ఉంది.

ఇంకా బావులు, చేతి పంపులు

గ్రేటర్ హైదరాబాద్‌లో 89 శాతం మందికి కుళాయిలు ఉండగా మేడ్చల్ జిల్లాలో 86.3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 85.3 శాతంగా ఉంది. గ్రేటర్ పరిధిలో చేతిపంపులపై ఆధారపడిన వారు ఇప్పటికీ 3.3 శాతం, మేడ్చల్ జిల్లాలో 2 శాతం, రంగారెడ్డి జిల్లాలో 2.4.శాతం మంది ఉన్నారు.

### కులాంతర వివాహాల్లో టాప్

రాష్ట్రంలోనే కులాంతర వివాహాల్లో అగ్రస్థానంలో జీహెచ్ఎంసీ ఉండగా తర్వాత స్థానాల్లో మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలు చోటు దక్కించుకున్నాయి. గ్రేటర్ పరిధిలో 14.3 శాతం కులాంతర వివాహాలు జరగ్గా, మేడ్చల్ జిల్లాలో 9.9.శాతం, రంగారెడ్డి జిల్లాలో 8.4 శాతంగా నమోదు అయ్యాయి.

### ముందస్తు వివాహాలు అధికం

జీహెచ్ఎంసీలో ముందుస్తు వివాహాలు ఎక్కువగా ఉన్నాయి. 11.1 శాతం మంది పురుషులు పెళ్లి వయస్సు రాక ముందే వివాహాలు చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7 శాతం పురుషులు, 7.3 శాతం స్త్రీలు, మేడ్చల్‌లో పురుషులు 6.6శాతం, స్త్రీలు 6.8శాతం మేర చట్టబద్ధ వయసులోపే వివాహ జీవితంలోకి అడుగుపెట్టారు.

### వైద్యం కోసం, రుణమే శరణ్యం!

వైద్య చికిత్సల కోసం పేదలు రుణాలు తెచ్చి మరీ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలున్నప్పటికీ ఏ మాత్రం ఊరట లేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో దాదాపు 11.5 శాతం మంది మెడికల్? పరంగా అప్పులు చేస్తున్నారు. నగరంలోని ఎస్సీ కేటగిరీ పేదలు దాదాపు 12.5 శాతం మంది అప్పుల కోసం అనధికార వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు.

### గ్రేటర్‌లో అక్షరాస్యులు 90 శాతం

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు జిల్లాల్లో కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలిస్తే ఆరేళ్ల నుంచి 29 ఏళ్ల వారిలో చదువుకున్న వారు 90 శాతం మంది ఉన్నారు. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 84.7శాతం మంది ఉండగా, అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 90.4శాతం మంది విద్యావంతులున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో చదువుకున్న విద్యార్థుల్లో అత్యధికంగా ఇంగ్లీష్ మీడియం వారున్నారు. రెండో స్థానంలో తెలుగు, మూడో స్థానంలో ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో తెలుగును మాతృ భాషగా మాట్లాడేవారు 53.10శాతంమంది ఉంటే, ఉర్దూ మాతృ భాషగా మాట్లాడేవారు 37.5 శాతం మంది. హిందీ మాతృ భాషగా మాట్లాడుతున్న వారు 6 శాతం ప్రజలు ఉన్నారు.

# 22 శాతం మందికే లక్ష పైన ఆదాయం

## ప్రైవేటులో అగ్రవర్ణాల చదువులు.. ప్రభుత్వ బడుల్లో ఎస్సీ ఎస్టీలు

**హైదరాబాద్ :** తెలంగాణలో కులగణన రిపోర్టులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని 78 శాతం కుటుంబాలకు ఆదాయం ఏడాదికి రూ. లక్ష కంటే తక్కువగానే ఉందని తెలిపింది. అదే సమయంలో తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలు.. అగ్రవర్ణాల కంటే 3 రెట్లు వెనుకబడి ఉన్నాయని తేలింది. అదే సమయంలో మొత్తం 242 కులాలు ఉండగా.. అందులో 135 కులాలను అత్యంత వెనుకబడినవిగా గుర్తించారు.తెలంగాణలో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నివేదికలో రాష్ట్రంలో కులాలకు సంబంధించిన సమగ్ర సమాచారం బయటికి వచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో మొత్తం 3.55 కోట్ల మంది ప్రజలు ఉన్నారని వెల్లడించింది. అంతేకాకుండా కులాలకు సంబంధించి కూడా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో విద్య, ఆర్థిక రంగాల్లో చాలా కుటుంబాలు వెనుకబడి ఉన్నాయని ఈ రిపోర్టు తెలిపింది. తెలంగాణలోని మొత్తం 242 కులాల్లో 135 కులాలు అత్యంత వెనుకబడినవిగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర జనాభాలోని 67 శాతం మంది ప్రజలు ఈ 135 కులాలకు చెందిన వారేనని వెల్లడైంది. ఇక రాష్ట్ర సగటు కంటే ఈ కులాలు ఎక్కువగా వెనుకబడి ఉండటం తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారింది.మరీ ముఖ్యంగా ఎస్టీల్లో 99 శాతం..



ఎస్సీల్లో 97 శాతం.. బీసీల్లో 71 శాతం మంది ప్రజలు.. తెలంగాణ రాష్ట్ర సగటు కంటే చాలా వెనుకబడి ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇక అగ్రవర్ణాలకు చెందిన 18 కులాలు రాష్ట్ర సగటు కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయని సీబీఐ ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. ఇక రాష్ట్రంలోని 78.2 శాతం కుటుంబాల సంవత్సర ఆదాయం రూ.లక్ష కంటే తక్కువగానే ఉన్నట్లు ఈ నివేదిక విస్తుపోయే నిజాలను బహిర్గతపరిచింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా ఎస్టీల్లో 88.2 శాతం.. ఎస్సీల్లో 86.2 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గిపోతున్నాయని వెల్లడైంది.అదే సమయంలో రాష్ట్రంలోని అగ్రవర్ణాల కంటే ఎస్సీ, ఎస్టీలు మూడు రెట్లు ఎక్కువగా వెనుకబడి ఉన్నట్లు ఈ నివేదిక తెలిపింది. ఇక బీసీలు కూడా అగ్రవర్ణాల కంటే 2.7 రెట్లు వెనుకబడి ఉన్నారని పేర్కొంది. ఇక అగ్రవర్ణాల్లో కూడా దాదాపు సగం మంది అంటే 43.8 శాతం కుటుంబాలు మాత్రమే లక్ష కంటే ఎక్కువ వార్షిక ఆదాయం కలిగి ఉన్నాయని తేలింది. ఏడాదికి రూ.5 లక్షల కంటే అధిక ఆదాయం ఉన్నవారిలో అగ్రస్థానంలో 13.2 శాతంతో అగ్రవర్ణాలు ఉండగా.. ఎస్సీ, ఎస్టీలు కేవలం 2.1 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. ఆదాయపు పన్ను కడుతున్న వారిలో 23.5 శాతం మంది అగ్రవర్ణాలకు చెందిన వారే కావడం గమనార్హం.సామాజిక వర్గాల మధ్య వ్యత్యాసాలు విద్యారంగంలో కూడా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. అగ్రవర్ణాలకు చెందిన వారిలో 34 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. అదే సమయంలో ఎస్సీల్లో 15 శాతం, ఎస్టీల్లో కేవలం 13 శాతం మంది మాత్రమే ప్రైవేటు బడుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. డిప్లొమా అంతకంటే ఎక్కువ ఉన్నత విద్య చదువుతున్న వారిలో 57 శాతంతో అగ్రవర్ణాలు ముందుండగా.. 31 శాతంతో ఎస్టీలు వెనుకబడి ఉన్నారని వెల్లడైంది. ఇక ఇంగ్లీష్ మీడియం చదువుల్లోనూ 66 శాతంతో అగ్రవర్ణాలు ముందంజలో ఉండగా.. ఎస్టీలు 36 శాతానికే పరిమితమయ్యారు.

## వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ టాప్

-మొదటిపేజీ తరువాయి

కోరింది. రాష్ట్రంలో యాసంగి పంట రానున్న నేపథ్యంలో సేకరణ, మార్కెటింగ్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌తో కలిసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయ్యారు. యాసంగిలో వచ్చే ధాన్యం బాయిల్డ్ రైస్‌కు అనుకూలమని ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్ తెలిపారు. గత ఆరు సీజన్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమౌతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందన్న మంత్రి ఉత్తమ్ 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు.

2014 --15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన దాదాపు 14 వందల 69 కోట్ల బకాయిలను విడుదల చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందన్న సీఎం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ కేంద్రం ప్రవేశపెట్టిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ సరఫరాను ఇటీవల నిలిపివేశారన్న సీఎం దానిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు కేంద్రమంత్రి సూత్రప్రాయ ఆమోదం తెలిపారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

### రైతుల అకౌంట్‌లో నగదు జమ

ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు 48 గంటల్లో కనీసమద్దతు ధరకు (ఎంఎస్‌పీ) తగ్గట్టు వారి బ్యాంక్ అకౌంట్‌లో నగదును జమ చేయనున్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణకు సంబంధించిన 30 లక్షల మెట్రిక్? టన్నుల బాయిల్డ్‌రైస్‌ను కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని తాము కేంద్ర మంత్రిని కోరినట్లు వివరించారు. "ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయనున్నాం. రాష్ట్రంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు 48 గంటల్లో కనీసమద్దతు ధరకు (ఎంఎస్‌పీ) తగ్గట్టు వారి బ్యాంక్ అకౌంట్‌లో నగదును వేయనున్నాం. ఈ పరిస్థితుల్లో తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్‌ను కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని మేము కేంద్ర మంత్రిని కోరాం

## పురుషుల్లో రొమ్ము క్యాన్సర్

**హైదరాబాద్ :** ప్రపంచవ్యాప్తంగా ఏటా కోటి మందిని క్యాన్సర్ మహమ్మారి బలిగొంటుండగా.. పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్ వేగంగా విస్తరిస్తోంది. రొమ్ము క్యాన్సర్ కేవలం మహిళలకే వస్తుందన్న అపోహ వల్ల పురుషులు లక్షణాలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా 87 శాతం కేసులు చివరి దశలో బయటపడుతున్నాయని సనత్‌నగర్ ఈఎస్ఐసీ అధ్యయనం వెల్లడించింది. ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేయగలిగే ఈ వ్యాధిని అవగాహన లోపం వల్ల ప్రాణాంతకంగా మార్చుకుంటున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రపంచాన్ని శరవేగంగా కబళిస్తున్న వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు కోటి మందికిపైగా ప్రాణాలు కోల్పోతున్నారు. మన దేశంలోనూ లక్షల సంఖ్యలో కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఒకసారి క్యాన్సర్ బారిన పడితే బయటపడడం చాలా కష్టం. చికిత్స తీసుకుంటూనే మరెన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక రొమ్ము క్యాన్సర్ అనగానే కేవలం మహిళలకు మాత్రమే వచ్చే వ్యాధిగా సమాజంలో ఒక బలమైన ముద్ర ఉంది. కానీ, పురుషుల్లో కూడా ఈ వ్యాధి ప్రబలుతోందని, అది కూడా ప్రాణాంతకమైన చివరి దశలో బయటపడుతోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ 2019 నుంచి 2025 మధ్య కాలంలో నిర్వహించిన ఒక ప్రత్యేక అధ్యయనంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.ఈఎస్ఐసీ అధ్యయనంలో పాల్గొన్న 15 మంది రోగుల డేటాను విశ్లేషించగా.. అందులో 60 శాతం మంది థర్డ్ స్టేజ్‌లో, 26.7 శాతం మంది ఫోర్త్ స్టేజ్‌లో ఉన్నప్పుడు మొదటిసారి డాక్టర్‌ను సంప్రదించారు. అంటే సుమారు 87 శాతం మందిలో క్యాన్సర్ శరీరం అంతటా వ్యాపించిన తర్వాతే చికిత్స ప్రారంభమైంది. లక్షణాలు కనిపించినప్పటి నుంచి వ్యాధి నిర్ధారణ అయ్యే వరకు సగటున ఆరు నెలల జాప్యం జరుగుతోందని డాక్టర్లు గుర్తించారు. అధ్యయనంలో పాల్గొన్న రోగులలో చాలా మందికి చనుమొన వెనుక గడ్డలు, చర్మం మె?ద్దుబారటం, చనుమొన లోపలికి కుంచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. ఇద్దరు రోగులలోనైతే వ్యాధి తీవ్రత పెరిగి పుండ్లు కూడా పడ్డాయి. ఇటువంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు.ఈఎస్ఐసీ ఆంకాలజీ విభాగం హెడ్ డాక్టర్ గుమ్మల్ విశేష్ మాట్లాడుతూ.. ఆయా రోగుల్లో ఎవరికీ ఫ్యామిలీలో క్యాన్సర్ హిస్టరీ, హార్మోన్ల సమస్యలు వంటి ముందస్తు ముప్పు కారకాలు లేవని చెప్పారు. పురుషుల్లో ఈ వ్యాధి అరుదు కావడంతో.. ప్రారంభ లక్షణాలను తప్పుగా అర్థం చేసుకోవడమే ఈ జాప్యానికి కారణమని అంటున్నారు. ఇక 2025లో జరిగిన ఫాలోఅప్ ప్రకారం.. 60 శాతం మంది రోగులు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఇద్దరు వ్యాధి తీవ్రతతో మరణించగా.. 26.7 శాతం మంది చికిత్స ఆపేశారు. ఈఎస్ఐసీలో ఉచిత చికిత్స అందుబాటులో ఉన్నప్పటికీ.. సుదూర ప్రయాణాలు, సామాజిక వివక్ష, అవగాహన లోపం వల్ల రోగులు చికిత్సకు దూరమవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు.మహిళల రొమ్ము క్యాన్సర్‌పై ఉన్నంత అవగాహన పురుషుల విషయంలో లేకపోవడం పెద్ద లోపంగా మారిందని అంటున్నారు. పురుషుల కోసం ప్రత్యేకంగా క్యాన్సర్ మార్గదర్శకాలు లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. పబ్లిక్ హెల్త్ మెసేజింగ్‌లో పురుషుల రొమ్ము క్యాన్సర్‌ను కూడా చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా గుర్తించడం వల్ల డేటా సేకరణ మెరుగుపడుతుందని అయితే జాతీయ స్థాయిలో దీనిపై ప్రత్యేక విధానాలు రావాలని నిపుణులు కోరుతున్నారు

## జగిత్యాలలో గురుశిష్యుల మధ్య పోరు

**కరీంనగర్ :** కాంగ్రెస్ సీనియర్ నేత.. నాలుగు దశాబ్దాలుగా ఆ పార్టీలో కొనసాగిన కురవృద్ధుడు.. శేష జీవితం ప్రశాంతంగా గడుపుతానని ప్రతీ ఎన్నికల్లో ఇవే నాకు చివరి ఎన్నికలు అంటూ ప్రకటిస్తూ.. ఓటమి చవి చూస్తున్న జీవన్‌రెడ్డి.. ఇటీవలే హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పారు. బీఆర్ఎస్ నుంచి జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి జీర్ణించుకోలేదు. పార్టీ మార్పిడి నిర్ణయం జగిత్యాల జిల్లా రాజకీయాల్లో భూకంపాన్ని సృష్టించింది. 1990 నుంచి జిల్లాలో ఆయన ప్రభావం ఎమ్మెల్యే టికెట్ల నుంచి మంత్రి పదవుల వరకు విస్తరించింది. ఈ చర్యతో స్నేహితులు విడిపోతూ, ప్రత్యర్థులు బలపడుతున్నారు. ఆయన మార్గదర్శకత్వంలో ఎన్నికల్లో విజయవంతమైన అనేక మంది ఇప్పుడు కొత్త మార్గాలు వెతుకుతున్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు తాజా రాజకీయ పరిణామాలు సంక్లిష్టంగా మారాయి. జీవన్ రెడ్డిని గురువుగా గౌరవించి, 2018 ఎన్నికల్లో ఆయన సపోర్ట్‌తో విజయం సాధించిన లక్ష్మణ్‌కుమార్ ఇప్పుడు పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు గురువుపై విమర్శలు చేయాల్సి వచ్చింది. గురువు మార్గదర్శనాన్ని వదులుకుని పార్టీకి లాయల్టీ చూపితే, స్థానిక ప్రజల సపోర్ట్‌లో లోటు పడవచ్చు. లేకపోతే, పార్టీలో స్థానం కోల్పోయే ప్రమాదం. ఈ సంక్లిష్ట పరిస్థితి అడ్లూరి రాజకీయ కెరీర్‌ను మలుపు తిప్పుతోంది.జీవన్‌రెడ్డి చర్య జగిత్యాలలో అధికార పద్ధతులను కుదిపిస్తోంది. బీఆర్ఎస్ ఈ విభేదాలను ఉపయోగించుకుని, స్థానిక అసంతృప్తి వర్గాలను తనవైపు మళ్లించుకుంటోంది. బీజేపీ కూడా కొత్త మైదానాలు తెరుస్తోంది. గత ఎన్నికల్లో జీవన్ ప్రభావంతో కాంగ్రెస్ బలపడినా కొన్ని మండలాలు ఇప్పుడు అనిశ్చితంలో ఉన్నాయి. వీటిని తనవైపు తిప్పుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో రాయికల్ మున్సిపాలిటీలో బీజేపీ పట్టు సాధించడమే ఇందుకు నిదర్శనం.గురు?శిష్యుల మధ్య ఈ ఉద్రిక్తత ఓ పూర్తి రాజకీయ యుద్ధానికి దారితీస్తుందా అనేది కీలక ప్రశ్న. జీవన్ రెడ్డి కొత్త పార్టీలో బలపడి, స్వతంత్ర అభ్యర్థులను ప్రోత్సహిస్తే, అడ్లూరి వర్గాలు విడిపోతాయి. అయితే, రహస్య సమావేశాల ద్వారా సమాధానం కనుక్కుంటే, జిల్లా రాజకీయాలపై అడ్లూరి పట్టు సాధించే అవకాశం ఉంటుంది. మంత్రిగా కూడా ఉన్న నేపథ్యంలో ఆయన నిర్ణయాలు ఇప్పుడు పార్టీకి దిశానిర్దేశం కానున్నాయి.

# వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ





**జగిత్యాల,ఏప్రిల్17, అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్** జగిత్యాల పట్టణ భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు ఎండ చాలా ఉన్నందున ఉచిత గొడుగులు పంపిణీ చేశారు అలాగే ఈ నెలలో 2026 ఏప్రిల్ 24 నాడు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆరాధనా మహోత్సవము పురస్కరించుకొని వీధులలో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఎండ మరియు వర్షం నుండి రక్షణగా ఉపయోగపడేలా పెద్ద మరియు చిన్న గొడుగుల పంపిణీ మరియు తలాటోపీల పంపిణీ చేయబడును అని తెలిపారు సత్యసాయి సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ మాట్లాడుతూ భక్తులందరి సహకారంతో ఇంత ఎండాకాలంలో రెక్కాడితే గాని డొక్కాడని వీధి వ్యాపారులకు ఇట్టి గొడుగుల పంపిణీ సేవతో పాటు , అలాగే వివిధ దీనజన సేవలు నిర్వహిస్తామని ముఖ్యంగా రెండున్నర నెలల పాటు ఈ వేసవి కాలానికి ప్రతిరోజు మినరల్ వాటర్ పంపిణీ జరుగుతుందని అన్నారు మరియు చెప్పులు తల టోపీలు బట్టర్ మిల్క్ వంటి తదితర వాటి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు ఇట్టి అన్ని సేవలకు సహకరిస్తున్న భక్తులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సేవలో సత్యసాయి సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, గుండ రాజశేఖర్ , వంగల లక్ష్మీనారాయణ ,సామ సునీల్, ఠాకూర్ నారాయణ్ సింగ్ ,గూడూరు మురళీధర్ రావు , అమిరిశెట్టి ప్రభు , గట్టు రాజేందర్, రాజశేఖర్ మరియు మహిళా సభ్యులు బట్టు శ్రీలత, గుండ అర్చన, సామ రజిత, వూటూరి నాగరాణి, జిల్లా రవళి , మహంకాళి కౌసల్య, సామ లత, మాధురి,లిఖిత తదితరులు పాల్గొన్నారు.

# భీష్మ కప్ సిజన్ 2 గంగపుత్ర క్రికెట్ టోర్నమెంట్ 2026 ప్రారంభం

**జగిత్యాల, ఏప్రిల్ 17, అక్షర రేఖ న్యూస్ సురేష్**జగిత్యాల పట్టణంలోని క్రీడా స్ఫూర్తిని పెంపొందించే దిశగా నిర్వహిస్తున్న భీష్మ కప్ సిజన్ 2 గంగపుత్ర క్రికెట్ టోర్నమెంట్ 2026 ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ అభివృద్ధి చెందుతాయని అన్నారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం ద్వారా కొత్త ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి అనేక జట్లు పాల్గొంటుండగా, మొదటి మ్యాచ్ ఉత్సాహభరితంగా సాగింది. క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ఉత్సాహపరిచారు . ఆయోజకులు తెలిపిన వివరాల ప్రకారం, టోర్నమెంట్ మొత్తం కొన్ని రోజుల పాటు



కొనసాగుతూ ఫైనల్ మ్యాచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. విజేతలకు బహుమతులు,ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడా సంఘ ప్రతినిధులు, యువత,ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జుంబర్తి గంగ లక్ష్మి



రాజ్ కుమార్, ప్రశాంత్ రావు, నాయకులు పృథ్విధర్ రావు, భీష్మ కప్ నిర్వాహకులు అరుముల్ల పవన్, బట్టు రాకేష్ టీజీడబ్ల్యూఎస్ జగిత్యాల అద్యక్షులు తిరుపతి, అడ్వకేట్ రమేష్, నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ అన్న ప్రసాద సేవ సమితి వారిచే అమావాస్య అన్నదానం




**జగిత్యాల, ఏప్రిల్17, అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్** జగిత్యాల పట్టణంలోని జంబీగద్ద సమీపంలోని జంభి హనుమాన్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రదేశంలో 2026 ఏప్రిల్ 17 శుక్రవారం అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద కార్యక్రమంను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముందుగా అన్నపూర్ణ మాతకు ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తదుపరి అన్నప్రసాద కార్యక్రమాన్ని జగిత్యాల పట్టణ డాక్టర్లు రాచకొండ శ్రీనివాస్,కోటగిరి బీమేష్,ఏన్నాకుల రాము 23 వ వార్డ్ కౌన్సిలర్ సుంకేటి మమత రామకృష్ణ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమంను ప్రారంభించారు. జగిత్యాల అన్నపూర్ణ అన్న ప్రసాద సేవాసమితి వారు ప్రతి అమావాస్య రోజున 1500 నుండి 2000 మందికి అన్న ప్రసాదంను ప్రతి నెల అమావాస్య అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ ప్రసాద సేవ సమితి వ్యవస్థాపకులు చైర్మెన్ అయినటువంటి చకినం ప్రసాద్ మాట్లాడుతూ అమావాస్య రోజున అన్నదానం చేయడం వల్ల పిత్రు దోషాలు తొలగిపోయి, పూర్వీకుల ఆత్మలకు శాంతి చేకూరుతుందని హిందూ ధర్మం చెబుతోంది. అందుకని నేను నా మిత్ర బృందం కొందరం కలిసి గత సంవత్సరం ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించబడింది ఈ కార్యక్రమం నేటితో 11 వ నెల అని అన్నారు. అమావాస్య అన్న దానం విశిష్టత ను వివరిస్తూ పితృదేవతలు భగవాన్ శ్రీ మహావిష్ణువు అనుమతితో భూమిపైకి వచ్చే ఈ రోజున పేదలకు అన్నదానం చేయడం వల్ల కుటుంబంలో ఆరోగ్యం, సంపద, సంతోషం మరియు శ్రేయస్సు కలుగుతాయి, అలాగే చేసిన పాపాలు నశిస్తాయని నమ్మకం. అమావాస్య పితృ దేవతలకు అంకితమైన రోజు ఈ రోజున చేసే అన్నదానం, తర్పణం వల్ల పూర్వీకులు సంతోషించి తమ వంశస్థులను ఆశీర్వదిస్తారు. పితృ దోష నివారణ జాతకంలో పితృ దోషం లేదా పితృ శాపం ఉన్నవారు ఈ రోజు పేదలకు, సాధువులకు లేదా బ్రాహ్మణులకు అన్నదానం చేయడం వల్ల ఆ దోషాలు తొలగిపోతాయి. కర్ణుని కథ ను చూస్తుంటే మహాభారతంలో కర్ణుడు బంగారం దానం చేసినా ఆహారం దానం చేయనందున పరలోకంలో ఆహారానికి ఇబ్బంది పడ్డాడు. పితృ పక్షంలో అన్నదానం యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ, పూర్వీకులకు అన్నం సమర్పించడం వల్లనే ఆత్మలకు శాంతి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. జీవజాలానికి అన్నదానం అమావాస్య నాడు మానవులకు జంతువులకు



ఆవులు, కాకులు, కుక్కలకు ఆహారం పెట్టడం చాలా పుణ్యకార్యంగా పరిగణించబడుతుంది ఇది పూర్వీకులకు నేరుగా ఆహారం చేరుతుందనే నమ్మకాన్ని బలోపేతం చేస్తుంది. అమావాస్య నాడు దానధర్మాలు చేయడం వల్ల ఇంట్లో ప్రతికూల శక్తులు నశించి, ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుంది. అమావాస్య నాడు పేదలకు, ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఉత్తమమైన మార్గంగా భావిస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ అన్న ప్రసాద సేవా సమితి చైర్మన్ చకిణం ప్రసాద్, గంప రాములు, మురికి వేంకట రమణ, బోనగిరి సురేష్, కోటగిరి శ్రీనివాస్, ఊటూరి లవకుమార్, మానేరు సురేష్ , ఏన్నాకుల శ్రీకాంత్, బి.రాం మూర్తి,అక్కినపెల్లి చంద్రశేఖర్,మాధవి,మోటూరి కిషన్,బట్టు రఘు, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు... స్వర్గీయ మాజీ ఎంపీపీ బొల్లం బిక్షపతి సేవలు చిరస్మరణీయం...

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి... మాజీ జెడ్పిటిసి సభ్యులు బొల్లం అజయ్ మణికంఠ....

**రఘునాథపల్లి/ అక్షర రేఖ) ఏప్రిల్17:** వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో గాల టోల్గేట్ సమీపంలో సురక్షితమైన తాగునీటి సౌకర్యాన్ని చలివేంద్రాన్ని వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి గారు జనగామ జిల్లా మాజీ జడ్పీటీసీ ల ఫోరమ్ అధ్యక్షులు బొల్లం అజయ్ మణికంఠలి ప్రారంభించారు... మాజీ ఎంపీపీ స్వర్గీయ బొల్లం బిక్షపతి స్మారకరాకర్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని వారు అభినందించారు. చలివేంద్రం ఏర్పాటు చేసి తమ ఉదాసీనతను బొల్లం కుటుంబం చాటుకుంది. పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రతిరోజు ప్రజలు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు.. త్వరలో బిక్షపతి.. పేరుతో సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘునాథపల్లి మండల బి ఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ ముసుపట్ల విజయ్, మండల యూత్ అధ్యక్షులు దుబ్బాక



హరీష్ గౌడ్, వెల్ది ఉపసర్పంచ్ ఎడ్ల బాలరాజ్, బాల్నే పరుశు రాం,పేర్ని ప్రసాద్, పేర్ని లెనిన్, కరీంకొండ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

## చైత్ర మాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు.

--అమ్మ వారికి ముడుపు సమర్పణ



**జగిత్యాల, ఏప్రిల్ 17, అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్** జగిత్యాల పట్టణం చింతకుంట సమీపం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో ఏప్రిల్ 17 చైత్ర మాసం, శుక్ల పక్షం శుక్రవారం అమావాస పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్థోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం మరియు అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించారు తదుపరి అమ్మ వారికి ముడుపులు కట్టారు ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ల స్వాతి, గాల్లిపెల్లి సుజాత, మాధురి, హర్షిణి, భారతి, స్వప్న, ఊర్మిళ, మాధవి,గంగవ్వ. అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీద కుటుంభంనకు ఆధ్యాత్మిక ఆర్య వైశ్య వారిచే



## వంట సామగ్రి అందుచేత

**జగిత్యాల, ఏప్రిల్17, అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్** జగిత్యాల పట్టణ ఆధ్యాత్మిక ఆర్య వైశ్య కుటుంబ వారిచే మానసిక వ్యాధి తో బాధపడుతున్న కుటుంబానికి సమితి వారు చేయూత అందించారు వీరి కుటుంబ పరిస్థితి గురించి తెలుసుకొని చేయూత అందించారు వివరాల్లోకి వెళ్లితే మతి స్థిమితం లేని తల్లి,పక్ష వాతం వచ్చిన తండ్రి ఆలనా పాలన చూసుకోవడానికి తానే అన్ని అయి తల్లిదండ్రులకు సేవ చేస్తున్నాదు తనకు పెళ్లిడు వచ్చిన పెళ్లి చేసుకోకుండా తల్లిదండ్రులే దైవంగా భావించి వారికోసం జీవితం త్యాగం చేసి వారిని కన్న బిడ్డల వలె కాపాడుకుంటూ మద్యాహన్నా వేళల్లో మేకలే జీవనాధారం చేసుకొని వాటిపై వచ్చే ఆదాయంతో బ్రతుకు వెళ్లదీస్తున్న ఒక కలియుగ శ్రవణుడు ఇతనికి మనం చేసే చిరు సహాయము కొంతలో కొంత ఉపశమనం కలిగించవచ్చు అని వీరి ముగ్గురికి ఒక నెల రోజులపాటు భోజన సదుపాయం కల్పించే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషకరం మానవసేవే మాధవ సేవ అనే ఉద్దేశంతో ఇంత మంచి కార్యక్రమం ఆధ్యాత్మిక వైశ్య గ్రూపు వారి ఆధ్వర్యంలో జరగడం చాలా సంతోషకరం అని తెలిపారు ఈ కార్యక్రమంలో బొల్లం పాపన్న ధనలక్ష్మి 13వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి శ్రీనివాస్ వాణి నగర్ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గుండ పద్మ ఆధ్యాత్మిక గ్రూపు ఆర్యవైశ్య సభ్యులు బాసెట్టి ప్రభాకర్ , సూర శ్రీనివాస్ , కొత్త వేణుగోపాల్ , కటకం సురేష్ గారు పుల్లూరు వెంకన్న, పోకల పరమేష్ , యాంసాని శ్రీనివాస్ , బొడ్ల రమేష్ , బోనగిరి శ్రీనివాస్, కే ఎల్ వి కృష్ణ , యాంసాని సంతోష్ , రాయించ హరీష్ ,మరియాల రాజన్న , వావిలాల శేఖర్ , బాసెట్టి కృష్ణ , గంప రమేష్ తదితరులు పాల్గొన్నారు



## పీఆర్సి నివేదికను జూన్ రెండు లోపు ఇవ్వాలి

ఇచ్చోడలో తహసీల్దార్ కు వినతి

**ఇచ్చోడ ఏప్రిల్ 17, (అక్షర రేఖ) :** ఉద్యోగ ఉపాధ్యా యులకు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని, పిఆర్సి నివేది కను జూన్ రెండు లోపు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్, స్తానిక మండల అధ్య క్షులు రాజేందర్ అన్నారు. తెలంగాణ ఉద్యోగ, ఉపా ధ్యాయ పెన్షనర్ ల ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్ర వారం ఇచ్చోడ మండల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం స్తానిక తహసీల్దార్ షేక్ ఇమ్రాన్ ఖాన్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వా లని సిపిఎస్ ను రద్దుచేసి ఓపీఎస్ ను పున:రుద్ధరిం చాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, సుభాష్ ప్రసాద్ రాజ్, స్తానిక తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి పీఆర్టీయూ డిమాండ్



**ఇచ్చోడ ఏప్రిల్ 17, (అక్షర రేఖ):** ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలనీ బోథ్ మండల శాఖ పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వ ర్యంలో శుక్రవారం బోథ్ లో స్తానిక తహసీల్దార్ కార్యా లయంలో వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు మాట్లాడారు. రెండవ పీఆర్సీ ని వెంటనే ప్రకటించాలన్నారు. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. హెల్త్ కార్డ్ లను అందజేసీ, సీపీఎస్ ను రద్దు చేయాలనీ పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్నా ఇతర సమస్యలను పరిష్కరిం చాలనీ స్పష్టం

# ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా సిపిఐ పోరాటం

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్వారి వెంకటేశ్వర్లు**

**గట్టుప్పల్ ఏప్రిల్ 17 అక్షర రేఖ** గట్టుప్పల మండలంలో పచ్చని పంట పొలాలు, ప్రజలు నివసించే ప్రాంతాల మధ్యలో ఫార్మా కంపెనీలను స్థాపించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ ) పోరాటం కొనసాగిస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్వారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం "ఇంటి ఇంటికి సిపిఐ " కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను అధ్యయనం చేస్తూ గట్టుప్పల మండలం వెల్మకన్నె గ్రామంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ గత 100 సంవత్సరాలుగా పోరాటం సాగిస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ, కార్మిక రంగాలను సంక్షోభంలోకి నెట్టేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. వ్యవసాయ రంగంలో మార్పుల పేరుతో అమెరికాతో భారత్ కుదుర్చుకున్న ఒప్పందాలు దేశ రైతాంగానికి తీవ్ర ముప్పని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా, ఐకెపి కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లై నిబంధనలను సడలించి ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం మాట్లాడుతూ, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేసి పత్తి పంటకు రూ.12,000, వరి ధాన్యానికి రూ.6,000 మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బి. లాలయ్య, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్, రైతు సంఘం జిల్లా కోశాధికారి కంపే దుర్గయ్య, మండల కార్యవర్గ సభ్యులు కందాల ముత్యం, దెందే నరసింహ, కందాల శ్రీశైలం, బాలం లింగయ్య, భీమనపల్లి శివయ్య, షేక్ హుస్సేన్, తోటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐ అశ్వరావుపేట మండల సమితి









**అశ్వారావుపేట (అక్షరరేఖ )17.04.2026** పెద్ద వాగు ప్రాజెక్ట్ పున నిర్మాణం చేపట్టాలి --- సిపిఐ పాదయాత్ర లో జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా --- అశ్వారావుపేట పెద్దవాగు ప్రాజెక్టు పున నిర్మానం లో తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లు విఫలం. --- 98 కోట్ల తో ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేపట్టలేరా? ---- తెలంగాణ మంత్రులు తుమ్మల -పొంగులేటి రైతులకు ఇచ్చిన హామీలు నీటి మీద రాతలేనా?సిపిఐ ఆధ్వర్యంలో పెద్దవాగు ప్రాజెక్టు నుంచి వేలేరుపాడ్ వరకు పాదయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ సిపిఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ,సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబిర్ పాషా-సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ,సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథం ,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ డి సలీం నరాటి ప్రసాద్ ,కారం ధారయ ,బాడిశ రాము ,పిట్టా ప్రసాద్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య. ౹ాని సాబీర్ పాషా మాట్లాడుతూ పెద్దవాగు ప్రాజెక్ట్ వరద కు కొట్టకు పోయి దాదాపు రెండు ఏళ్ళు అవుతున్న నేటివరకు ప్రాజెక్టు పుననిర్మాణం చేపట్టలేక పోవటం అంటే ప్రభుత్వం వైఫల్యం చెందినది అని ఈశ్వరయ్య అన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు ఆయకట్టు 82 శాతం ఆంధ్రప్రదేశ్ రైతులకు తెలంగాణ రైతులకు 18 శాతం ఆయకట్టు ఉన్నది అని ప్రాజెక్ట్ పుననిర్మాణం కోసం 92 కోట్లు ఎస్టిమేషన్ చేసి నిధులు మంజూరి చెయ్యకుండా నిద్రపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయడు. డిప్యుటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు గిరిజన రైతులకు సాగునీరు అందించటం కోసం నిధులు మంజూరి చెయ్యరా అని ప్రశ్నించారు. రెండు ఏళ్ళు నుండి పంటలు సాగు చెయ్యక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు, ప్రాజెక్టు కట్ట తెగిపోతే తెలంగాణ ప్రభుత్వం రింగు బండ కోసం 3 కోట్ల పై చిలుకు ఖర్చు పెట్టినా నిరుపయోగం చేసి చేతులు దులుపుకున్నారు అని, తక్షణమే 92 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి అని, కొత్తగా 5 లాక్స్ ఏర్పటు చెయ్యాలి అని అన్నారు. శుక్రవారం పెద్దవాగు ప్రాజెక్ట్ నుండి వేలేరుపాడు వరకు వేయి మంది భారీ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభం చెయ్యాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఐ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

## రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి..... గమ్యాన్ని చేరడానికి రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి....

**రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడబెల్లి శ్రీనివాస్ రెడ్డి.**




**రఘునాథపల్లి/ అక్షర రేఖ ) ఏప్రిల్17:** రోడ్డు ప్రమాదాల నియంత్రణ తప్పనిసరిగా పాటించాలని... వాహనదారులు ప్రయాణికులు గమ్యస్థానాన్ని చేరుకోవడానికి రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని జనగామ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... అతి వేగంతో వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. దీనితోపాటు రోడ్డు నియమ నిబంధనలు పాటించకుండా మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా చాలామంది యువకులు మృత్యువాత పడుతున్నారని ఆయన అన్నారు.వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్,బెల్ట్ సీటు ధరించి వాహనాలు నడపాలి అన్నారు. ముఖ్యంగా యువత మదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు బానిసలై అదేవిధంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుంతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలు పాటించి హెల్మెట్ ధరించి నడపలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు రోడ్డు నియమాల గురించి ఇప్పటికే ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ వాడడం చాలా ప్రమాదకరమన్నారు. పోలీస్ శాఖ ప్రత్యేకంగా వాహనదారులకు వేగాన్ని తగ్గించి రోడ్డు నియమ నిబంధనలు పాటించి వాహనాలు నడిపే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ వారు ఆరు రోజులు అన్ని గ్రామాల్లో అరైవ్, అలైవ్ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రేపు చివరి రోజున కార్యక్రమం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఆయన వివరించారు.

## రమేష్ గౌడ్ పై ఆరోపణలు సరికాదు

**అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సిగ్గు చేటు**

**ఎస్సీ, ఎస్టీ, బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు.**



**కామారెడ్డి. ఏప్రిల్ 17: అక్షర రేఖ న్యూస్):** జిల్లా కేంద్రంలోని ఆర్. అండ్. బి. అతిథి గృహంలో కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పరిధి పేట గ్రామ అంబేద్కర్ బహుజన నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన బిడ్డ అయిన పల్లె రమేష్ గౌడ్ పై కొంతమంది తమ స్వార్థం కోసం ఆరోపణలు చేస్తూ చేసిన ఫిర్యాదును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే దళిత, బహుజనుల ఆగ్రహానికి గురికాక తప్పదని దళిత, బహుజన సంఘాల నాయకులు హెచ్చరించారు.పాల్వంచ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పల్లె రమేష్ గౌడ్ ప్రజా సేవకుడు అని, అతడు దళితులను అవమానించే వ్యక్తి కాదన్నారు. కులమతాలకు అతీతంగా అందరితో కలసి ఉండే వ్యక్తి అని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తిపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. ఆయనపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే వారు గ్రామంలో మాట్లాడుకోవాలి తప్ప ఇలా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. తనతో రాజకీయ విభేదాలు ఉంటే గ్రామంలో చూసుకోవాలే తప్ప కొంత మందిని ఉసిగొలిపి ఇలా కేసులు పెట్టించడం తగదని ఫరీద్ పేట గ్రామ సర్పంచ్ నర్సింహ రెడ్డి కి సూచించారు. గ్రామంలో ప్రతీ యేటా జరిగే సీతారాముల కళ్యాణోత్సవంలో దళితులను ప్రత్యేకంగా పిలిచి బట్టలు పెట్టి పూజలో కూర్చుండబెట్టిన రమేష్ గౌడ్ పైన దళితులను కించపరిచేలా మాట్లాడాడని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామంలో అభివృద్ధి ఎవరి ద్వారా చేశారో గ్రామంలో నిరూపించుకోవాలని గుర్తు చేశారు ఇప్పటికైనా రమేష్ గౌడ్ పై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని లేనియెడల తమ ఇండ్లను ముట్టడిస్తామని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎస్పి చైతన్య రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో దళిత, బహుజన సంఘాల నాయకులు దేవుళ్ళ రాములు, బైండ్ల రామస్వామి, విష్ణు, లక్ష్మీనర్సు, భూమవ్వ, కొంగల లక్ష్మి, రాజమణి, వరలక్ష్మి, తగిరంచ రాజిరెడ్డి, పెరుమాండ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైల మల్లికార్జున స్వామి వారి సేవా కార్యక్రమాలకు బయలుదేరిన జగిత్యాల నారీమణులు..



**జగిత్యాల,ఏప్రిల్ 17, అక్షర రేఖ న్యూస్ మానేరు సురేష్** జగిత్యాల పట్టణం నుంచి 20 మంది నారీమణులు శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి వారి వివిధ ఆలయాల్లో సేవా చేయడానికి జగిత్యాల పట్టణ మహిళలు సేవ చేయడానికి బయల్దేరి వెల్లారు. శ్రీశైలంలో అక్కడ ఉన్న ఆలయాల్లో సేవా కార్యక్రమాలు చేయడానికి మూడు రోజుల సేవా కార్యక్రమాలు చేసి మహిళలకు తరువాత స్వామి వారిని దర్శించుకొని ఆదివారంనాడు గ్రామానికి తిరిగి రావడం జరుగుతుందని మహిళలు తెలిపారు.

## చింతపల్లి ఎక్స్ రోడ్స్‌లో 'గోల్డెన్ అవర్ స్పందన' శిక్షణ కార్యక్రమం




**చింతపల్లి, ఏప్రిల్ 17 (అక్షర రేఖ):**రోడ్డు ప్రమాదాల సమయంలో తొలి గంటలో తీసుకునే చర్యలు ప్రాణాలను కాపాడడంలో అత్యంత కీలకమని తెలియజేస్తూ 'అరైవ్ అలైవ్' కార్యక్రమం 5వ రోజు భాగంగా చింతపల్లి ఎక్స్ రోడ్స్ వద్ద 'గోల్డెన్ అవర్ స్పందన' శిక్షణ కార్యక్రమాన్ని చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల వైద్యాధికారి సమన్వయంతో చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారికి ప్రమాదం జరిగిన వెంటనే ఎలా స్పందించాలి, బాధితులకు ఎలా సహాయం అందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా హృదయ స్పందన పునరుద్ధరణ (సీపీఆర్) విధానం, ప్రాథమిక చికిత్స పద్ధతులు గురించి వివరించి, ప్రాయోగికంగా చూపించారు.రోడ్డు ప్రమాద బాధితులకు సమయానికి సహాయం అందిస్తే ప్రాణ నష్టం తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వాహనదారులు పాల్గొని శిక్షణ పొందారు.

## నాగార్జునసాగర్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు





**చింతపల్లి, ఏప్రిల్ 17 (అక్షర రేఖ):**చింతపల్లి మండలంలోని నాగార్జునసాగర్ హైవేపై పోలపల్లి రామ్ నగర్ పరిధిలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మహబూబ్ నగర్ ప్రాంతానికి చెందిన సూర్య గిరిధర్ గౌడ్ (28) తన సహచరుడితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా, ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సూర్య గిరిధర్ గౌడ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మరొక వ్యక్తిని స్థానికులు వెంటనే గోడకొండ్ల మాల్ లోని లైఫ్ స్టార్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనికి వైద్య చికిత్స కొనసాగుతోంది.ప్రమాదానికి కారణమైన లారీ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ విషాద ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కు సన్మానం భగవద్గీత ప్రదానం...

**భావి జీవితం జాతీయ భావం, ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి...**

**ఆర్.యు.పి.పి.టి. ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్...**



**రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17 అక్షర రేఖ న్యూస్** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీపూర్ స్కూల్ అసిస్టెంట్ హిందీ మద్దెల సరోజన గంగారాం ఉద్యోగ విరమణ సందర్భంగా రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ పక్షాన జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ఘనంగా శాలువా తో సత్కరించి భగవద్గీత ప్రదానం చేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో సరోజన మేడమ్ ఎంతో మంది జాతీయభావాలు కలిగిన ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దారని, ఎనలేని సేవలు చేసారని, భావి జీవితం జాతీయత, ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని, జాతీయతే దేశానికి శ్రీరామ రక్ష అని, భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచానికి అదర్శవంతమైనవని, ధర్మో రక్షతి రక్షితః అన్న అచరణాత్మకత కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం మద్దెల ప్రభాకర్, సుజాత, కస్తూరి శ్రీధర్, సత్యనారాయణ, శరత్ చంద్ర, కవిత, పద్మరాణి, సుచరిత, సింగని హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

ప్రజలు నిత్యం సైబర్, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి -- ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి

రహదారుల ప్రమాదాల నివారణకు అవగాహన కీలకం -- కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత వారోత్సవాలలో "అర్రైవ్ అ లైవ్" కార్యక్రమం కింద శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దమ్మపేటలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మరియు జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్హత్ పథకం గురించి కూడా వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిత్యం సైబర్ మోసాలు మరియు రహదారి ప్రమాదాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ మోసాలపై, బయటకు వెళ్లినప్పుడు రహదారి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చుగానీ, రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ "రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. 'అర్రైవ్ అ లైవ్' కార్యక్రమం ద్వారా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. జిల్లాలో కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి వంటి పరిశ్రమల కారణంగా భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్యసహాయం అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నాము. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలి."జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ



రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, వైద్య, రవాణా తదితర శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి రహదారి భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కొంతమందికి డ్రైవింగ్ లైసెన్సులు అందించారు. పూసుకుంట గిరిజన కొండరెడ్డి సమాజానికి చెందిన వారికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్, పాల్వంచ డిఎస్పి సతీష్, తాసిల్దార్ రామ్ నరేష్ ఎంపీడీవో రవీందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను అంతం చేద్దాం

ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గోడ పత్రిక ఆవిష్కరణ:

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని విద్యా చందన ,జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** ఎయిడ్ సంస్థ వారి ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో బాల్య వివాహాల నిర్మూలనకై గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. బాల్య వివాహాల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకంగా అని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం, అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలని బాల్య వివాహం అనేదే లేని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కై నిరంతరం శ్రమించాలని విద్యాచందన పిలుపునిచ్చారు. ఏప్రిల్ 19 అక్షయ తృతీయ సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆమె చాంబర్లో ఆవిష్కరించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు





చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు . చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా జరుగుతాయని ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని జిల్లా సంక్షేమ అధికారిని ఆఫీసర్ స్వర్ణలత లెనినా తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సమ్మక్క డిపిఎం, నర్మద డీపీఎం, అనురాధ ఏపిఎం ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ మోహన్ , మాన్సింగ్,జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు

## అమృత్ జల పథకం బాధితుడు మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు

న్యాయం చేయాలని వేడుకోలు

అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17 అక్షర రేఖ న్యూస్** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం కు చెందిన అమృత్ జల్ పథకం భూ బాధితుడు కుర్మా మల్లారెడ్డి మానవ హక్కుల కమిషన్ శుక్రవారం ఆశ్రయించగా ఐస్ ఆర్ నెంబర్ అనుసరించి 1567/2026 కమిషన్ లో నమోదయింది. ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా భూముల పంట పొలాల మధ్య రైతులకు దాదాపు (80) మంది వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు నష్టం వాటిల్లే విధంగా కాంట్రాక్టులకు కక్కుర్తి పడి, అనవసరంగా (అవసరం లేనిచోట) వాటర్ ట్యాంకు నిర్మాణశీ పేరుతో మా యొక్క భూములను అన్యాయంగా లాక్కొనే ప్రక్రియను అధికార యంత్రం నిలిపివేసి, వేరొక చోట నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికిని స్పందించక పోవడంతో మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ ఆధారిత రైతులశీ అయిన. మేము కుర్మ మల్లారెడ్డి, కుర్మ నారాయణ రెడ్డి, కుర్మ ప్రేమ్ కుమార్ రాయికల్ పట్టణంలో నివసిస్తున్నాము. మాకు సర్వేనెంబర్ 988/2/1/1/1, 988/2/1/2/1, 988/2/1/3/1 యందు వ్యవసాయ పట్టా భూములను కలిగియున్నాము. ఇట్టి భూములలో మేము వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాము. మాకు ఇట్టి భూమే వ్యవసాయమే జీవనాధారము. కానీ, ఇట్టి సర్వేనెంబర్ల యందు రెవెన్యూ మరియు మున్సిపల్ శాఖల వారు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, మా అనుమతి లేకుండా, బలవంతంగా మా భూమిని లాక్కోవాలనే దురుద్దేశ్యంతో భూములను వాటర్ ట్యాంకు నిర్మాణం కొరకు భూసేకరణ చేస్తున్నట్లుగా పై అధికారులకు నివేదికను పంపారు అని, మా అనుమతి లేకుండానే మా భూములను ల్యాండ్ అండ్ సర్వే విభాగం వారిచే తప్పుడు సర్వే నిర్వహించి కాంట్రాక్టులకు కక్కుర్తి పడి, ఇట్టి వాటర్ ట్యాంకు నిర్మాణం చేయుటకు బలవంతంగా మమ్ములను బెదిరిస్తూ యంత్రాలతో ఇట్టి భూములలో నిర్మాణ పనులకు నాలుగు శాఖల అధికారులు కదిలి వచ్చి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు మా కుటుంబాలను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయికల్ లో ఇప్పటికే మిషన్ కాకతీయ క్రింద ఆరు వాటార్ ట్యాంకుల నిర్మాణం చేసినారు. ఇందులో ఒక మెగా వాటర్ ట్యాంక్ ఉందని ఇది ఒక్కటే రాయికల్ మండలం మొత్తాన్ని త్రాగునీరు సరఫరా చేయగల సామర్థ్యం కలదనీ అయినప్పటికిని కమీషన్లకు కక్కుర్తి పడి, మా పంట పట్టాభూముల్లో అక్రమంగా ఆక్రమించి వాటర్ ట్యాంకు నిర్మాణం చేయాలని సంకల్పించినారు. ఒకవేళ వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగితే మాతో పాటు మా చుట్టు ప్రక్కల ఉన్నటువంటి రైతుల భూముల నుండి పైపు లైన్ల ను ఏర్పాటు చేయవల్సి వస్తుంది అని దాంతో వారు కూడా తీవ్రంగా నష్ట పోతారు మేము గతంలో ప్రభుత్వ ఐ.కె.పి. -స్త్రీశక్తి భవన్ ఉచితంగా దాదాపు 06 గుంటల భూమిని దానంగా ఇవ్వడం జరిగింది. ఇప్పుడు బలవంతంగా మా యొక్క అనుమతి లేకుండ భూములు కబ్జా చేయుటకు అధికారులు చూడడంతో మా మూడు కుటుంబాలు రోడ్డున పడి అడుక్కునే పరిస్థితికి వస్తాయని అధికారులు బలవంతంగా గుంజుకుంటే మాకు ఆత్మహత్యే శరణ్యం. కన్నీటి పర్యంతమయ్యారు. వాస్తవముగా ఇట్టి వాటర్ ట్యాంక్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ భూములలో నిర్మించుటకు అవకాశము ఉంది అని



అయిన అధికారులు ఉద్యేష్యాపూర్వకంగా మా పంట భూములను నాశనం చేయాలని అధికారులు సంకల్పించడం శోచనీయం అని అన్నారు. మా యొక్క వంట పట్టా భూముల యందు ఏర్పాటు చేయ చేయతలపెట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణము నిలిపివేసి, మా భూమిపై అధికారులు చేసిన తీర్మానాలు రద్దు చేయాలని మా భూములు మాకు ఇప్పించాలని కోరినట్లు తెలిపారు.

## గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన -- కొత్తగూడెంలో శిక్షణ కార్యక్రమం

జిల్లా వైద్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమం మరియు రహదారి భద్రత అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ గారు కొత్తగూడెం ఆర్టీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను కాపాడటంలో అత్యంత కీలకమైన "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే తక్షణ స్పందన ఎలా ఉండాలి, ఆ సమయంలో తీసుకోవాల్సిన ప్రాణరక్షణ చర్యలు ఏమిటి అనే విషయాలను వివరించారు. అలాగే డ్రైవర్లు మరియు సాధారణ ప్రజలకు గుండె ఆగినప్పుడు చేయాల్సిన కార్డియో పల్మనరీ పునరుద్ధరణ (సీపీఆర్) పద్ధతిపై అవగాహన కల్పించి, ప్రాయోగిక ప్రదర్శన (డెమో) చూపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ (ప్రోగ్రామ్ అధికారి, ఎంహెచ్ఎన్), డాక్టర్ సుందర్ (ఆర్బీఎస్కే మెడికల్ అధికారి) మరియు ఆర్టీఓ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రమాద సమయంలో తక్షణ స్పందన, సరైన ప్రాణరక్షణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించారు.

## అత్యవసర సమయంలో ఆపద్బాంధవుడు

స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసిన న్యాయవాది



**రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17 అక్షర రేఖ న్యూస్** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన కళావతి అనే మహిళకు అత్యవసర సమయంలో శాస్త్ర చికిత్స కోసం రక్తం అత్యవసరం కావడంతో స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు వచ్చి న్యాయవాది అల్లే పురుషోత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రి లో రక్తదానం చేశారు. ఇది తొమ్మిదవ సారి రక్తదానం కావడంతో అవసరం వచ్చినప్పుడు రక్తదానం చేసినందుకు ఆయనను పలువురు అభినందించారు. ఇట్టి సందర్భంగా న్యాయవాది అల్లే పురుషోత్తం మాట్లాడుతు రక్తదానం చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని, కొందరు భావిస్తున్నారని ఇది పూర్తిగా అవాస్తవం అని రక్తదానం వలన శరీరంలో పాత రక్తం పోయి కొత్త రక్తం రావడంతో గుండెపోటు లాంటి సమస్యల భారీన పడకుంట ఉంటారని మరిన్ని ఆరోగ్య ఉపయోగాలు రక్తదానం వలన ఉన్నాయని రక్తదానం చెయ్యడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహలు నమ్మవద్దని, అందరు అత్యవసర సమయంలో రక్తదానం చేయుటకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

## పెండింగు లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై వినతి



**రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17 అక్షర రేఖ న్యూస్** శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లో తహసీల్దార్ నాగార్జున కు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఈఈజేఏసి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా యొక్క డిమాండీలు, 1.జూన్ 22002 పి ఆర్ సి క్యూ, 2.పెండింగ్ బిల్లులు 2 విడతలలో చెల్లిం చాలి. 3. సి పి ఎస్ రద్దు చేయాలి. 2003 డిస్సీ వారికి వెంటనే ఓపి ఎస్ అమలు చేయాలి. 4. మే -1 వావ్ హెల్త్ కార్డ్స్ జగ్రీ. 5. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు ఒకే విడతలో చెల్లించాలి. కావున మీరు దయతో పై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జెఎసి నాయకులు అంతడుపుల గంగారాజం, బొల్లె గంగాధర్, రాపర్తి నర్సయ్య, ఎలిగేటి రాజాకిశోర్, దొంతి సతీష్ ముక్కెర శేఖర్, గాజంగి రాజేశం, బాపు రావు, కడుకుంట్ల అభయ్ రాజ్, రాము, మహేష్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో... అయిదుగురుకి ఒక రోజు జైలు శిక్ష

ఇచ్చోడ సీఐ బండారి రాజు



**ఇచ్చోడ ఏప్రిల్ 17, (అక్షర రేఖ) :** డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రాణ నష్టం సంభవిస్తుందని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ బండారి రాజు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో పట్టుబడిన అయిదుగురుకి శుక్రవారం బోథ్ కోర్టులో హాజరు పర్చగా వారికి జెఎఫ్సిఎం న్యాయమూర్తి కే సందీప్ కుమార్ ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని సీఐ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్ , శ్రీకాంత్, అనిల్, రమేష్, రాములు అనే వ్యక్తులు డ్రంక్ చేసి డ్రైవ్ చేస్తున్న నేపథ్యంలో వారిని నివారించి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయగా అతిగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిందని చెప్పారు. వీరితో పాటి మరో తొమ్మిది మందికి బోథ్ కోర్టు నందు ఒకరోజు సోషల్ సర్వీస్ చేయాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని, మరో పదహారు మందికి మందికి జరిమానా విధించారని సీఐ స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమవుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహా రించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి, వాహానా లను నడపవద్దని ఆయన సూచించారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత...






**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**రాహా-వీర్ పథకం క్రింద గోల్డెన్ అవర్‌లో సహాయం చేసిన వారికి 25 వేలు బహుమతి**

**ఖమ్మం జిల్లాలో 30 బ్లాక్ స్పాట్లను సరిదిద్దడంతో ప్రమాదాలు తగ్గుదల**

**రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ఏఐ ద్వారా కఠిన చర్యలు**

**హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి... నిర్లక్ష్యం ప్రాణాంతకం**


**ఆర్టీవో కార్యాలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ -17** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా రవాణాధికారి కార్యాలయంలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. రాహ-వీర్, పిఎం రాహత్ అనే రెండు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించిన వారికి రాహ-వీర్ పథకం క్రింద 25 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తామని తెలిపారు. పీఎం రాహత్ పథకం క్రింద ప్రమాద బాధితులకు లక్షన్నర వరకు నగదు రహిత చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తామని వివరించారు. ఈ పథకాలు గోల్డెన్ అవర్‌ను సమర్థవంతంగా వినియోగించేందుకు తీసుకొచ్చినవని తెలిపారు. సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం మన రక్షణ కోసమేనని, వాటిని తప్పించుకోవాలని ప్రయత్నించడం సరికాదని సూచించారు. కారులో ప్రయాణించే సమయంలో డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులు కూడా తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో టాప్ 30 యాక్సిడెంట్ బ్లాక్ స్పాట్లను గుర్తించి సరిదిద్దినట్లు తెలిపారు. దీని వల్ల ప్రమాదాలు తగ్గి ఈ ఏడాది 15 మంది ప్రాణనష్టం తగ్గిందని అన్నారు. మరిన్ని బ్లాక్ స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వినియోగించి వాహనాలను గుర్తించి భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వారి లైసెన్సులు రద్దు చేసి వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా రోడ్డు భద్రతలో అగ్రగామిగా నిలవాలని, ప్రమాదాలు జరగకుండా అందరూ కృషి చేయాలని సూచించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలను చూస్తున్నప్పటికీ ఇంకా నిర్లక్ష్యం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి తమను తాము రక్షించుకోవాలని, ఒకరి ప్రాణ నష్టం కుటుంబానికి, తమకు ఎంతో పెద్ద నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. లా అండ్ ఆర్డర్ అదనపు డిసిపి ప్రసాదరావు మాట్లాడుతూ అరైవ్ అలైవ్ అంటే ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఒక్కరూ సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుకోవడం అని భావించాలన్నారు. వాహనదారులు అందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించడం తప్పనిసరి అని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం కఠినంగా నిబంధనలు అమలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు కార్యాలయ ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్, డాక్టర్లచే డ్రైవర్లకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండటం రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకమని అన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మేయర్ లు కేఎంసి డిఆర్ఎఫ్ టీమ్ సిబ్బందికి హెల్మెట్లు ప్రధానం, రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు, ఆర్టీసీ ఖమ్మం రీజియన్ లో ఉత్తమ డ్రైవర్ లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఆర్టీఓ జె.ఎన్. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఏఎంవిఐలు జి. దినేష్, జి. సుమలత, ఆర్టీఏ మెంబర్ జి. వెంకన్న, కౌన్సిలర్లు, వాహనదారులు, ప్రజలు, సాంస్కృతిక సారథి కళాకారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య దిశలో మార్గదర్శి -- డా. రాంప్రసాద్ నారగాని సేవల సారాంశం"

**ప్రారంభం -- ఆరోగ్యమే మహాభాగ్యం**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సూక్తి ప్రతి మనిషి జీవితంలో ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఒక దేశ అభివృద్ధి, ప్రజల ఆరోగ్య స్థితిపై ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యవంతమైన సమాజం ఉన్నప్పుడు మాత్రమే ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ప్రజారోగ్యాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకొని అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో డా. రాంప్రసాద్ నారగాని ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ ప్రజారోగ్యానికి ఒక ఆదర్శంగా నిలిచింది. గ్రామీణ భారతంలో ఆరోగ్య పరిస్థితి -- ఒక విశ్లేషణ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సదుపాయాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. ముఖ్య సమస్యలు: వైద్యుల కొరత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లోపాలు అవగాహన లేమి పేదరికం వల్ల చికిత్సకు దూరం ఈ సమస్యల వల్ల చిన్న వ్యాధులు కూడా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వైద్యులు స్వయంగా గ్రామాలకు వెళ్లి సేవలు అందించడం అత్యవసరం. మెగా మెడికల్ క్యాంప్ -- ఒక సమగ్ర ఆరోగ్య కార్యక్రమం డా. రాంప్రసాద్ నారగాని నాయకత్వంలో నిర్వహించిన ఈ క్యాంప్‌లో: జనరల్ మెడిసిన్ నేత్ర వైద్యం పిల్లల వైద్యం ఆర్థోపెడిక్ సేవలు దంత వైద్యం అందించడం ద్వారా ఒకే వేదికపై సమగ్ర వైద్య సేవలు అందించారు. 400కి పైగా రోగులకు ఉచిత పరీక్షలు చేసి మందులు అందించడం విశేషం. ఈ క్యాంప్ ద్వారా: రోగులను ముందుగానే గుర్తించడం తీవ్రమైన కేసులను రిఫర్ చేయడం ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం జరిగింది. డా. రాంప్రసాద్ -- సేవ, నాయకత్వం, నిబద్ధత డా. రాంప్రసాద్ నారగాని సేవలు ఒక వైద్యుని బాధ్యతను మించి ఉన్నాయి. ఆయనలో కనిపించే ముఖ్య లక్షణాలు: సేవాభావం సమాజం పట్ల బాధ్యత నాయకత్వ నైపుణ్యం ప్రజలతో అనుసంధానం ఆయన కేవలం రోగులను చికిత్స చేయడమే కాకుండా, ఆరోగ్య అవగాహన కల్పించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వ దృష్టి -- అమలులో విజయాలు




తెలంగాణ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయడానికి: మెడికల్ క్యాంపులు ఉచిత వైద్య సేవలు గ్రామీణ ఆరోగ్య కార్యక్రమాలు చేపడుతోంది. ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంలో డా. రాంప్రసాద్ వంటి వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వేసవి ఆరోగ్య సమస్యలు -- ముందస్తు జాగ్రత్తల అవసరం వేసవి కాలంలో సాధారణంగా వచ్చే సమస్యలు: డీహైడ్రేషన్ హీట్ స్ట్రోక్ చర్మ సమస్యలు డా. రాంప్రసాద్ ప్రజలకు ఇచ్చిన సూచనలు: తరచుగా నీరు తాగాలి బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి శుభ్రమైన ఆహారం తీసుకోవాలి ఈ అవగాహన రోగాల నివారణకు ఎంతో ఉపయోగపడుతుంది ఆరోగ్య అవగాహన -- దీర్ఘకాలిక పరిష్కారం వైద్యం కంటే ముఖ్యమైనది అవగాహన. ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటే: వ్యాధులు తగ్గుతాయి ఖర్చులు తగ్గుతాయి జీవన ప్రమాణం మెరుగవుతుంది కాబట్టి ప్రతి క్యాంప్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం చాలా అవసరం. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ బలోపేతం -- ముందున్న మార్గం ఇంకా చేయాల్సిన పనులు: ప్రతి గ్రామంలో మెరుగైన ఆరోగ్య కేంద్రాలు నిపుణులైన వైద్యులు నియామకం డిజిటల్ హెల్త్



సేవలు అంబులెన్స్ సౌకర్యాలు ఈ మార్పులు జరిగితే గ్రామీణ ఆరోగ్య రంగం పూర్తిగా మారిపోతుంది. సమాజంపై ప్రభావం -- ఒక సానుకూల మార్పు ఈ క్యాంప్ వల్ల: ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది వైద్య సేవలపై నమ్మకం పెరిగింది పేదలకు ఉపశమనం లభించింది ఇది సమాజంలో ఒక సానుకూల మార్పుకు దారితీసింది. ముగింపు -- ఆదర్శంగా నిలిచే సేవలు డా. రాంప్రసాద్ నారగాని చేసిన సేవలు ప్రజారోగ్య రంగంలో ఒక ఆదర్శంగా నిలుస్తాయి. ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేసే వారిగా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ విధమైన కార్యక్రమాలు కొనసాగితే గ్రామీణ భారతం ఆరోగ్యవంతంగా మారుతుంది. "ఆరోగ్యవంతమైన ప్రజలు -- అభివృద్ధి చెందిన దేశం" అనే లక్ష్యం సాధ్యమవుతుంది.

## పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మం..

**రేషన్ బియ్యం దందా సాగిస్తున్న ఆత్మకూరి జగదీష్ పై పీడీ యాక్ట్ అమలు:పోలీస్ కమిషనర్**

**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆత్మకూరి జగదీష్ పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పేదలకు ఉచితంగా అందాల్సిన బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, బయట రాష్ట్రాలక తరలిస్తుండటంతో ఖమ్మం జిల్లాలో 13 కేసులు, సూర్యాపేట, వరంగల్ జిల్లాలో రెండు కేసుల్లో ప్రధాన నిందుతుడుగా వున్న ఖమ్మం నగరానికి చెందిన ఆత్మకూరి జగదీష్ పై శుక్రవారం పీడీ యాక్ట్ అమలు చేసి హైదరాబాద్ చంచలగూడ



సెంట్రల్ జైలు తరలించడం జరిగిందన్నారు .దీర్ఘకాలికంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ, తరచూ పట్టుబడటంతో పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు తెలిపారు. పేదల కడుపు కొట్టే రేషన్ బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన సదస్సు

**-- గ్రామాల్లో ఆరోగ్య సేవలు బలోపేతం చేయాలి: డా. తుకారాం రాథోడ్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** కొత్తగూడెం డివిజన్‌లో నిర్వహించిన సూపర్‌వైజర్లు, మీనూల నెలవారీ సమీక్షా సమావేశంలో డీఎంహెచ్ఓ డా. తుకారాం రాథోడ్ ఆరోగ్యంపై అవగాహన పెంపు అత్యంత కీలకమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు సమతుల ఆహారం, యోగ, వ్యాయామం వంటి ఆరోగ్య అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. పెయిన్‌కిల్లర్ మందులపై ఆధారపడకుండా ఫిజియోథెరపీ ద్వారా నొప్పులను తగ్గించుకోవాలని, గర్భిణీలకు సాధారణ ప్రసవాల కోసం వ్యాయామం అవసరమని చెప్పారు. ఎండాకాలంలో వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, తగినంత నీరు, ఌఌ వినియోగించాలని సూచించారు. ఌఅలాగే జీవనశైలి వ్యాధుల నివారణ, ౹ఌం వ్యాక్సిన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని, గ్రామసభలు, పాఠశాలలు, అంగన్వాడీలలో ఆరోగ్య విద్య బోధన చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో పలు వైద్యులు, ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

## మాలల జనాభా తగ్గింపు కుట్రా? గణాంకాల్లో మోసం బహిర్గతం చేయాలి

**కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కుట్ర**

**మాలలపై కుట్ర తోనే ఎస్సీ వర్గీకరణ చేసిన రేవంత్ రెడ్డి**

**ఇప్పటికైనా కాంగ్రేస్ పార్టీ లొ ఉన్న మాల మంత్రులు బయటికి రావాలి**

**మాలమహానాడు జిల్లా ఇంచార్జి దామాల సత్యం**



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** తెలంగాణ రాష్ట్రంలో మాలల జనాభాపై ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలపై మాలమహానాడు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాలమహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి దామాల సత్యం మాట్లాడుతూ, 2011 జనగణన ప్రకారం మాలల జనాభా సుమారు 15 లక్షలు ఉండగా, తాజా లెక్కల్లో 14 లక్షలుగా తగ్గించడం అనుమానాస్పదమని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో మాలల జనాభా 55,70,244గా నమోదు కాగా, ఇప్పుడు తెలంగాణలో జనాభా తక్కువగా చూపించడం వెనుక అసలు కారణాలు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర కులాల జనాభాలో మార్పులు లేకపోయినా, మాలల జనాభానే తగ్గించడం అనేది పక్కా కుట్రగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అంశంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సత్యం ఆరోపించారు. మాలల హక్కులు, ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా జనాభాను తగ్గించి చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిజమైన గణాంకాలను బయటపెట్టాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మాలలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాల ముట్టడులు, భారీ నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. మాలల జనాభా అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, లెక్కల్లో పారదర్శకత పాటించాలని దామాల సత్యం డిమాండ్ చేశారు.

## భద్రాచలం ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షలకు మాల మహానాడు మద్దతు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** భద్రాచలంలోని ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షలకు మాల మహానాడు నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్రాజు ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు దీక్ష శిబిరాన్ని సందర్శించి కార్మికులతో ఐక్యత ప్రకటించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ, కార్మికులు గత 23 రోజులుగా నిరంతరం పోరాటం చేస్తున్నప్పటికీ ఐటీసీ యాజమాన్యం స్పందించకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటం గమనించకుండా యాజమాన్యం వ్యవహరిస్తోందని, ఇది అంగీకారయోగ్యం కాదన్నారు. మహిళలు సైతం ముందుండి పోరాటంలో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. అదేవిధంగా, కార్మికులపై యాజమాన్యం మరియు కాంట్రాక్టర్లు ఒత్తిడి తీసుకురావడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలు జరుగుతున్నాయనే సమాచారం వచ్చిందని, అలాంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని హెచ్చరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారి శ్రమకు తగిన ఫలితాన్ని మాత్రమే కోరుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఈ సమస్యపై వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే, రానున్న రోజుల్లో కార్మికుల పోరాటానికి మాల మహానాడు పూర్తి మద్దతుతో పాటు సహాయ సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మహిళా నాయకులు, జిల్లా నాయకులు మరియు ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

## "'13క్ష్ర అంబేద్కర్ జయంతి వేడుకలో - మహనీయులు పుస్తకాల పంపిణీ చేసిన నిమ్మ జీవన్....



**దోమకొండ ఏప్రిల్ 17 (అక్షర రేఖ న్యూస్)** కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబర్పేట్ గ్రామములో విద్యార్థుల కు మహనీయులు అయిన జ్యోతి భాపులే సావిత్రి బాయి పులే మాదిరి భాగ్యరెడ్డి వర్మ, ఙ= దీ= అంబేద్కర్,కాన్షీరాం జీవిత చరిత్ర లు మరియు భారత రాజ్యాంగ పుస్తకాలు మరియు కాలేజీ బ్యాగ్ లు వారి గ్రామములో ఇంటర్ మరియు డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు పంచాయతి సెక్రటరీ నిమ్మ జీవన్ పంపిణీ చేయడం జరిగింది తదనంతరం అతను మాట్లాడుతూ మహనీయుల చరిత్రలోనే అసలైన జ్ఞానం దాగి ఉందని వాటిని చదివి సమాజం పట్ల బాధ్యత గా ఉండి జీవితాలను సరైన మార్గంలో ప్రయాణించేలా చూసుకోవాలని తెలిపినారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుట్ల కవిత అనిల్, మాజీ ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్, నిమ్మ శేఖర్, ఫిరంగి బెంజమిన్,ఆరుట్ల వెంకటేష్ ( ఆర్మీ) ,పిట్ల జాన్ పిట్ల స్వామీ ఫిరంగి విష్ణు తదితరులు పాల్గొని విజయవంతం చేసిన ఈ కార్యక్రమములో విద్యార్థుల హర్షం వ్యక్తంతో ముగిసింది..

అక్షర రేఖ

శనివారం 18 ఏప్రిల్ 2026

## ఎండాకాలం జాగ్రత్తలు తెలియజేయాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల :** ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే జాగ్రత్తలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారుసిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి.. సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి .. వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది తదితరులు ఉన్నారు

## నేషనల్ హైవే63 వద్ద

## భూ సంబంధిత అంశాలపై ఫీల్డ్ విచారణ.

**ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. ఎస్ లత**

**జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలంలోని పోరండ్ల గ్రామ పరిధిలోని నేషనల్ హైవే?63 వద్ద భూ సంబంధిత అంశాలపై ఫీల్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)బి.ఎస్ లత మాట్లాడుతూ ప్రత్యక్షంగా స్థలాన్ని సందర్శించి, సంబంధిత భూసమస్యలు, సరిహద్దులు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. స్థానిక రైతులు, భూ యజమానుల నుండి అభిప్రాయాలు, ఫిర్యాదులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల సరిదిద్దడం, అవసరమైన ధృవపత్రాల జారీ, మరియు చట్టబద్ధమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు.ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను పరిష్కరించి, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా సేవలు అందించడానికి చర్యలు కొనసాగుతాయని ఈ సందర్భంగా తెలిపారు.ఈ పరిశీలనలో జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకిమ్, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## సీఎం పర్యటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి :** ఈనెల 20వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ కాళేశ్వరం, అనంతరం కాటారం మండలం నస్తురుపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు పటిష్టమైన బందోబస్తు కేటాయించిన విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. నస్తూర్ పల్లి బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభా స్థలి వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని డీపీవోకు సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. చేపట్టనున్న పనులను పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్ కు సూచించారు. హెలి ప్యాడ్, అప్రోచ్ రోడ్డు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అలాగే పబ్లిక్ మీటింగ్ వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని పిఆర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో లైటింగ్, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు అంబులెన్సులు సేఫ్ హౌస్ ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాళేశ్వర దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయాలని ఈఓను ఆదేశించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు వారి కేటాయించిన విధులపై ధ్రువీకరణ నివేదిక అందజేయాలని తెలిపారు. సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

## కుర్నవల్లి అభివృద్ధికి సహకరించండి..

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కోరిన..**

**కుర్నవల్లి సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ**



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ ఏప్రిల్ 17** కూర్నవల్లి గ్రామానికి అభివృద్ధి సహకరించాలని మంత్రి ఎమ్మెల్యే లను సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ కోరారు.శుక్రవారం రాష్ట్ర నాయకులు ఐలూరి వెంకట కోటారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ కుర్నవల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు, రహదారులు , అదేవిధంగా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలసి గ్రామ సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ కుర్నవల్లి గ్రామ పెద్దలు అయిలురి వెంకటకోటరెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలసి కుర్నవల్లి అభివృద్ధి కి పాటు పడాలని త్వరలో గ్రామ పంచాయతీ ఆఫీస్ ప్రారంభించ వలసినదిగా మంత్రి , ఎమ్మెల్యే గని కోరారు. కుర్నవల్లి కి అత్యధికముగా నిధులు కేటాయించి అభివృద్ధి కి తగు హామీ ఇచ్చి కుర్నవల్లి ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామన్నారు.

## అమరజీవి దండి భాస్కర్ వర్ధంతి సందర్బంగా ఘన నివాళ్ళు అర్పించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్



**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ. విద్యార్థి దశ నుండి ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకి ముందుండి ప్రజల కోసం శ్రమించిన విప్లవ నాయకులు గొప్ప ఆదర్శ మూర్తి, ఎందరికో రాజకీయం గా మార్గదర్శి, ప్రముఖ జర్నలిస్ట్ సిపిఐ పార్టీ ముఖ్య నాయకులు అయినటువంటి కామ్రేడ్ శ్రీ దండి భాస్కర్ 10 వ వర్ధంది సందర్బంగా వారి స్మారక స్థూపం వద్ద కొబ్బరికాయ కొట్టి పూలు వేసి ఘన నివాళ్ళు అర్పించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్. ఈ సందర్భంగా వారితో పాటు మేళ్లచెరువు సురేష్, భద్రా చారీ పాల్గొన్నారు.

## బీజేపీ ఎంపీ తేజస్వి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

**- పార్లమెంట్ వద్ద ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి నిరసన**




**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ న్యూస్ ఏప్రిల్ 17** రాష్ట్ర విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరం ప్లకార్డులు చేతబట్టి కాంగ్రెస్ ఎంపీలతో కలిసి నినాదాలు చేసిన రామసహాయం న్యూ ఢిల్లీ: పార్లమెంట్ లో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై ద్వేషపూరితంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం పార్లమెంట్ వద్ద తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడటాన్ని భారత్– పాకిస్తాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ బలిదానాలకు కాంగ్రెస్సే కారణమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా వెనక్కు తీసుకోవాలని, ఇది తెలంగాణ అమరవీరుల త్యాగాలను అవమానపరచడమే అని అన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ పట్ల ద్వేషాన్ని వెళ్ళగక్కారని, పార్లమెంటు రికార్డుల్లో ఈ వ్యాఖ్యలను శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేస్తూ.. " బిజెపి క్షమాపణలు చెప్పాలి", " తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలి" అంటూ..నినాదాలతో హోరెత్తించారు.

## అగ్నిప్రమాదం పై తక్షణమే స్పందించిన...

**కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు దంపతులు**





**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ ఏప్రిల్ 17 వైరా** 20 వ వార్డ్ లో మేరీ ఇమ్మాక్యులేట్ స్కూల్ దగ్గర ఒక చెట్టుకు మంటలు అంటుకొని అటు కరెంటు తీగలకు ఇటు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారటంతో విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ,వెంటనే కరెంటు డిపార్ట్మెంట్, ఫైర్ స్టేషన్ మున్సిపల్ కమీషనర్ వారిని సమన్వయము చేసుకొని సమస్యనుపరిష్కరించారు .ఈ కార్యక్రమంలో ,లైన్ ఇన్స్పెక్టర్ జార్జ్ , స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ. శ్రీనివాసరావు, ఫైర్ ఫైటర్ కె.వీరభద్రం మరియు ఫైర్ సిబ్బంది టి. అప్పారావు, పి. రాంబాబు, ఎన్ ప్రకాశరావు , మున్సిపల్ కమిషనర్ గురులింగం పాల్గొన్నారు. వెంటనే స్పందించిన ఫైర్ డిపార్ట్మెంట్ కరెంటు డిపార్ట్మెంట్ మున్సిపల్ డిపాట్మెంట్ లకు కౌన్సిలర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ

**20వ వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో**

**ఉచిత వైద్య శిబిరం విజయవంతం..**





**ఖమ్మం జిల్లా బ్యూరో అక్షర రేఖ ఏప్రిల్ 17 వైరా** వైరా మున్సిపాలిటీ ఛైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మరియు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు అద్వర్యంలో విజయవంతం అయిన ఉచిత హెల్త్ క్యాంప్ 20 వ వార్డ్ లో ఎస్.టి కాలనీ, గవర్నమెంట్ స్కూల్ నందు శుక్రవారం ఎస్బిఐ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖమ్మం జిల్లా డిసిసి మెడికల్ హెల్త్ విభాగం సెల్ ఛైర్మెన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్బిఐ ఫౌండేషన్ రాంకీ ఫౌండేషన్ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఇలాంటి అవకాశాన్ని 20 వ వార్డ్ ప్రజలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిభిరంలో ఉచితంగా షుగర్ పరీక్షలు, బి.పి ఈసిజీ పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో 20 వ వార్డ్ కాంగ్రెస్ నాయకులు వంకడోత్ బిక్యా, తేజావత్ నాగేశ్వరరావు, యడ్ల పృథ్వీరాజు , రాజు , కృష్ణ , మాజీ కౌన్సిలర్ లక్ష్మిబాయ్, నాగమణి ,ఆశ వర్కర్ నవీన స్కూల్ టీచర్స్, మెడికల్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్ డాక్టర్. ఎం విజయభూషణ్ , స్టాఫ్ నర్స్ పి.ప్రియాంక , నాగంయొయాహి ,ఫార్మసిస్ట్ అర్పిత, డ్రైవర్ ఉపేందర్ పాల్గొన్నారు

# రహదారి ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**ప్రజలు నిత్యం సైబర్, రహదారి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి :**

**ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి**

**రహదారుల ప్రమాదాల నివారణకు అవగాహన కీలకం**

**కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత వారోత్సవాలలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం కింద శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మరియు జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్వత్ పథకం గురించి కూడా వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిత్యం సైబర్ మోసాలు మరియు రహదారి ప్రమాదాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ మోసాలపై, బయటకు వెళ్లినప్పుడు రహదారి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోతే తిరిగి సంపాదిం చుకోవచ్చుగానీ, రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పో యారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ "రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. 'అరైవ్ అ లైవ్' కార్యక్రమం ద్వారా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. జిల్లాలో కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి వంటి పరిశ్రమల కారణంగా భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్యసహాయం అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నాము. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలి." జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, వైద్య, రవాణా తదితర శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నా

Printed, Published & Owned by V. SAI KRISHNAREDDY, Printed at SAI KRISHNA PRINTERS, Door No. 7-7-86/1, Near Collector Chowk, Adilabad (T.S) 504001 Published at H.No. 1-2-125/1, Pithruchaya Nilayam, Shanti Nagar, Adilabad-504001 (T.S) Editor: V. SAI KRISHNA REDDY, RNINO. TELTEL/2012/44706, CELL:7073352171, Email: aksharerekhadaily@gmail.com